RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD

సంపుటి : 11 సంచిక : 69 గురువారం 23 - 10 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ

# ఉస్మా'నయా' హాస్పిటల్

## రెండేళ్లలో పూర్తి కావాలి

- పనుల వేగవంతానికి వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ
- రానున్న వందేళ్ల అవసరాలకు తగినట్లు వసతుల కల్పన
- పనుల తీరుపై తరచూ క్షేత్ర స్థాయిలో తనిఖీ
- పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు
- నిర్మాణాలపై 24/7 అధికారి పర్యవేక్షించేలా పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగించాలని ముఖ్యమంత్రి సూచించారు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఉస్మానియా నూతన హాస్పిటల్ నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నూతన హాస్పిటల్ రానున్న వందేళ్ల అవసరాలకు తగినట్లు వసతుల కల్పన, అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని, పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

- మిగతా 2 లో

# తెలంగాణలోని అన్ని చెక్ పోస్టులు రద్దు




- రవాణాశాఖ కీలక నిర్ణయం
- తెలంగాణ వ్యాప్తంగా అన్ని రవాణా చెక్‌పోస్టుల ఎత్తివేత
- తక్షణమే మూసివేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
- అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రవాణా శాఖ
- సాయంత్రం 5 గంటలలోగా పూర్తి చేయాలని డెడ్‌లైన్
- సిబ్బందిని జిల్లా కార్యాలయాలకు తరలించాలని సూచన
- బోర్డులు, బారికేడ్లు తొలగించి వీడియో తీయాలని ఆదేశం

తెలంగాణలో వాహనదారులకు ఊరట కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

- మిగతా 2 లో

## మేడారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




మేడారంలో సమ్మక్క- సారలమ్మను దర్శించుకున్న సీఎం రేవంత్

అమ్మవార్లకు భక్తి శ్రద్ధలతో నిలువెత్తు బంగారం సమర్పించిన రేవంత్

తులాభారంలో 68 కేజీలు తూగిన సీఎం రేవంత్ రెడ్డి

మేడారం ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు

## పాక్‌లో ధరల మంట

## కిలో టమాటా రూ. 600, అల్లం రూ. 750!

- పాకిస్థాన్‌లో ఆకాశాన్నంటిన టమాటా ధర
- రావల్పిండిలో కిలో టమాటా 600 రూపాయలు
- అల్లం రూ. 750, బఠాణీలు రూ. 500కి చేరిక
- ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దు ఉద్రిక్తతలే కారణం
- ధరల ధాటికి టమాటాలు అమ్మడం మానేసిన చిరు వ్యాపారులు



పొరుగు దేశం పాకిస్థాన్‌లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటున్నాయి. ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దులో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా నిత్యావసరాల ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. ముఖ్యంగా రావల్పిండి నగరంలో కిలో టమాటా ధర ఏకంగా 600 రూపాయలకు చేరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.ప్రస్తుతం టమాటాలకు డిమాండ్ ఎక్కువగా ఉందని, కానీ సరఫరా చాలా తక్కువగా ఉందని రావల్పిండి సబ్జీ మండీ ట్రేడర్స్ యూనియన్ అధ్యక్షుడు గులాం ఖాదిర్ తెలిపారు. "ఆఫ్ఘనిస్థాన్ నుంచి టమాటాల దిగుమతి పూర్తిగా నిలిచిపోయింది. సరఫరా తిరిగి

- మిగతా 2 లో




# ఉగ్రవాదంపై కలిసి పోరాడదాం

ట్రంప్‌కు ప్రధాని మోదీ జవాబు

వైట్‌హౌస్‌లో దీపావళి వేడుకలు జరిపిన ట్రంప్

ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడానన్న అమెరికా అధ్యక్షుడు

రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గిస్తామని మోదీ హామీ ఇచ్చారని వెల్లడి

భారత్-పాక్ యుద్ధాన్ని ఆపింది తానేనని మరోసారి వ్యాఖ్య

ఉగ్రవాదంపై పోరాటమే ముఖ్యమన్న ప్రధాని మోదీ

## ఏపీకి పెట్టుబడులే లక్ష్యంగా తొలిరోజు భేటీలు

యూఏఈలో సీఎం చంద్రబాబు పర్యటన ప్రారంభం

తొలిరోజు భారత రాయబారులు, పారిశ్రామికవేత్తలతో భేటీ

ఏపీలోని పెట్టుబడుల అవకాశాలను వివరించిన సీఎం

విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రస్తావన

'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో వేగంగా అనుమతులు

యూఏఈలోని తెలుగువారికి అండగా నిలవాలని ఎంబసీకి విజ్ఞప్తి




## గల్ఫ్ ప్రవాసులకు అండగా

# 'ప్రవాసాంధ్ర భరోసా'

- దుబాయ్‌లో సీఎం చంద్రబాబు
- యూఏఈ పర్యటన కోసం దుబాయ్ చేరుకున్న సీఎం చంద్రబాబు
- విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికిన అధికారులు, ప్రవాసాంధ్రులు
- గల్ఫ్ ప్రవాసుల కోసం 'ప్రవాసాంధ్ర భరోసా' బీమా పథకం ప్రారంభం
- దురదృష్టవశాత్తు మరణిస్తే కుటుంబానికి రూ. 10 లక్షల వరకు పరిహారం
- ఎల్లుండి ప్రవాసీయులతో భారీ సమావేశంలో పాల్గొననున్న సీఎం



గల్ఫ్ దేశాల్లోని ప్రవాసాంధ్రులకు భరోసా కల్పించే దిశగా ఏపీ ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. సీఎం చంద్రబాబు తన యూఏఈ పర్యటనలో భాగంగా 'ప్రవాసాంధ్ర భరోసా' అనే ప్రత్యేక బీమా పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద దురదృష్టవశాత్తు ప్రవాసీయులు మరణిస్తే వారి కుటుంబానికి రూ. 10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందనుంది.మూడు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం దుబాయ్ చేరుకున్న సీఎం చంద్రబాబుకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. స్థానిక భారత కాన్సుల్ జనరల్ సతీశ్ కుమార్ శివన్, టీడీపీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ, దుబాయ్ నగర టీడీపీ అధ్యక్షుడు విశ్వేశరరావు, ఇతర అధికారులు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. పెద్ద సంఖ్యలో ప్రవాసాంధ్ర మహిళలు కూడా తరలివచ్చి స్వాగతం పలకడం విశేషం.ఈ సందర్భంగా టీడీపీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ మాట్లాడుతూ, ప్రవాసాంధ్ర భరోసా పథకం ఆపదలో ఉన్న ప్రవాసీ

- మిగతా 2 లో

# స్పోర్ట్స్ హబ్ దిశగా ఏపీ

- ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ సంస్థతో మంత్రి లోకేశ్ భేటీ
- బ్రిస్బేన్‌లో పాపులస్ సంస్థ ప్రతినిధులతో మంత్రి నారా లోకేశ్ భేటీ
- ఏపీని స్పోర్ట్స్ హబ్‌గా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్న లోకేశ్
- ప్రపంచ ప్రఖ్యాత స్టేడియాల నిర్మాణంలో పాపులస్ సంస్థకు ప్రత్యేక గుర్తింపు
- అత్యాధునిక క్రీడా సౌకర్యాల కల్పనకు సహకరించాలని విజ్ఞప్తి
- పర్యావరణహిత, కమ్యూనిటీ క్రీడా సముదాయాల డిజైన్లు అందించాలని కోరిక
- పర్యాటకం, స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా ప్రణాళికలు



ఆంధ్రప్రదేశ్‌ను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్చర్ సంస్థ 'పాపులస్' ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన క్రీడా మైదానాలకు రూపకల్పన చేసిన ఈ సంస్థ సహకారంతో ఏపీలో అంతర్జాతీయ స్థాయి క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.పాపులస్ సంస్థ సీనియర్ ప్రిన్సిపల్ ఆర్కిటెక్ట్ షాన్ గల్లఘర్, ఆసియా పసిఫిక్ బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ ఎలిజిబెత్ డిసిల్వాలతో మంత్రి లోకేశ్ చర్చలు జరిపారు. 40 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న పాపులస్ సంస్థ.. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ (సర్దార్ పటేల్) స్టేడియం, లండన్ ఒలింపిక్ స్టేడియం, న్యూయార్క్‌లోని యాంకీ స్టేడియం వంటి 3,500కు పైగా ప్రాజెక్టులను డిజైన్ చేసింది. ప్రస్తుతం భారత్‌లో ఎల్ అండ్ టీ సంస్థతో కలిసి పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై

- మిగతా 2 లో

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
గురువారం 23 - 10 - 2025

# సంపాదకీయం

## మెరుగయిన మహిళా భద్రత



మహిళల భద్రతలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో అగ్రస్థానానికి దూసుకుపోతుండటం గర్వకారణం. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అవగాహన కార్యక్రమాలు, పోలీసుల సత్వర స్పందన... ఇలా అన్నీ కలసి మహిళలకు భరోసా, నమ్మకం కల్పిస్తున్నాయి. ప్రతి మహిళ ధైర్యంగా న్యాయం కోసం పోరాడే సామర్థ్యాన్ని పొందేలా ప్రత్యేక పథకాలు పాలకులు అమలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాకముందు రాష్ట్రంలో హింస, అత్యాచారాల సంఖ్య పెరిగిపోయింది. మహిళలు భయంతో బతికే పరిస్థితి ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎన్సీఆర్బీ%-%2023 నివేదిక ప్రకారం, గత ప్రభుత్వ పాలనలో మహిళలు, బాలికలపై నేరాలు, అఘాయిత్యాలు గణనీయంగా పెరిగాయి. దేశవ్యాప్తంగా 8,416 కేసులు నమోదైతే, అందులో 2,826 (33.57శాతం) ఏపీలోనే ఉన్నాయి. బాధితుల సంఖ్యలో కూడా దేశంలో 8,661 మంది ఉంటే, ఏపీలో 3,020 మంది బాధితులు ఉన్నారు. జాతీయ క్రైం రేటు 1.3గా ఉండగా, ఏపీలో ఇది 10.6గా ఉందంటే గత ప్రభుత్వ హయాంలో మహిళలపై దాడులు ఎంత ఘోరంగా జరిగాయో అర్థమవుతున్నది. షెల్టర్‌హోమ్‌లలో బాలికలపై లైంగిక వేధింపుల విషయంలోనూ ఉత్తరప్రదేశ్ తరువాత ఏపీ మూడవ స్థానంలో ఉంది. దళితులపై దాడుల విషయంలో కూడా దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. వారానికి ముగ్గురు దళిత మహిళలు అత్యాచారానికి గురైన కేసులు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా 57,789 ఎస్సీ/ఎస్టీ కేసులలో 2,027 ఏపీలోనే నమోదయ్యాయి. ప్రతి నెలా మూడు హత్యలు, నలుగురిపై హత్యాయత్నాలు, వారానికి 11 దాడులు, రోజుకు సగటున 5%-%6 అకృత్యాలు జరిగాయంటే పరిస్థితి ఎంత హీనంగా ఉండేదో అర్థమవుతోంది. మహిళలు, బాలికల భద్రతపై ఎన్సీఆర్బీ గణాంకాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. అత్యాచారాల్లో 98 శాతం కేసుల్లో నిందితులు బాధితురాళ్లకు పరిచయమైనవారే అని ఎన్సీఆర్బీ రిపోర్ట్ స్పష్టం చేసింది. 2023లో పోక్సో కింద నమోదైన 858 కేసుల్లో 99.4 శాతం బాధితులకు తెలిసినవారే నిందితులుగా తేలారు. వీటిలో 425 కేసులు సోషల్ మీడియా పరిచయాల వల్ల, 335 కేసులు కుటుంబ సభ్యులు, స్నేహితులు, పొరుగువారి వల్ల, 93 కేసులు బాధితుల సొంత కుటుంబసభ్యుల వల్ల చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల్లో భద్రతపై నమ్మకం పెరిగింది. హత్యలు, నేరాలు, మహిళలపై అఘాయిత్యాలు ఇప్పుడు తగ్గుముఖం పట్టాయి. నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడం వల్ల రాష్ట్రంలో భద్రతా వాతావరణం మెరుగుపడింది. ఇందుకు గణాంకాలే సాక్ష్యాలు. గత ఏడాదితో పోలిస్తే మహిళలపై దాడులు 4.84శాతం తగ్గినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో తెలిపారు. వరకట్న మరణాలు 86 నుంచి 49కి, మహిళా హత్యలు 33 నుంచి 28కి తగ్గాయి. 343 మంది నిందితులపై పోక్సో చట్టాన్ని అమలు చేశారు. 13,672 పాఠశాలలు, కళాశాలల్లో స్వీయరక్షణ శిక్షణ, 17,576 మంది బాలికలను శక్తి వారియర్స్‌గా తీర్చిదిద్దారు. కేవలం 15 నెలల్లోనే కూటమి ప్రభుత్వం మహిళల భద్రతా ప్రమాణాలను పెంచింది. అత్యాచారాలు, దాడులపై సాంకేతికత, పోలీసు చర్యలు, సామాజిక అవగాహనలను సమన్వయం చేసి, భద్రతా వాతావరణాన్ని పెంపొందించింది. 'నేషనల్ యాన్యువల్ రిపోర్ట్ ఇండెక్స్ ఆన్ ఉమెన్స్ సేఫ్టీ%-%2025' ప్రకారం, విశాఖపట్టణం దేశంలోనే అత్యంత సురక్షిత నగరాల్లో రెండో స్థానంలో నిలిచింది.రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నేరాల నుంచి రక్షణకు అవగాహన కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాం. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రలో పర్యటించి, మహిళలకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పిస్తున్నాం. వన్ స్టాప్ సెంటర్ల ద్వారా వందలాది మహిళలు రక్షణ పొందుతున్నారు. గృహహింస, ఆస్తి వివాదాలు, ఉద్యోగం చేసే ప్రదేశాల్లో వేధింపుల విషయంలో న్యాయం పొందుతున్నారు. అదేవిధంగా ఫేక్ శక్తి సదన్‌లపై ఉక్కుపాదం కూడా మోపాం. మహిళా సంక్షేమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాల ద్వారా మహిళలను ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తున్నది. దీపం పథకం, తల్లికి వందనం, స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక సహాయం, ఉచిత బస్సు ప్రయాణం కల్పించింది. మహిళల స్వయం సమృద్ధి కోసం హస్తకళలు, చిన్న వ్యాపారాలు, డిజిటల్ మార్కెటింగ్, నైపుణ్య శిక్షణలను అందిస్తున్నారు. అయితే, కొన్ని సంఘటనలు ఇంకా కలవరపెడుతున్నాయి. పాలకొల్లు, ఉయ్యూరు, విజయవాడ సమీప గ్రామాలు, విశాఖలో చోటుచేసుకున్న ఘటనలు సమాజం ఎంత జాగ్రత్తగా ఉండాలో సూచిస్తున్నాయి. శారీరకంగా, మానసికంగా బలహీనమైన బాలికలు దాడులకు గురై తమ వేదనను బయటపెట్టలేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై న్యాయ ప్రక్రియ కూడా వేగవంతం కావాలి, ప్రత్యేక కోర్టులు మరింత బలంగా పనిచేయాలి. కేవలం చట్టాలే సరిపోవు, సామాజిక దృక్పథం కూడా మారాలి. కుటుంబం, పాఠశాలలు, సమాజం కలిసి కృషి చేస్తేనే మహిళలు ధైర్యంగా జీవించే ఆస్కారం కలుగుతుంది.

## స్పోర్ట్స్ హబ్ దిశగా ఏపీ

**మొదటిపేజీ తరువాయి** – పనిచేస్తోంది.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా ఏపీలో క్రీడారంగాన్ని బలోపేతం చేసేందుకు సహకరించాలని కోరారు. "రాష్ట్రంలో అత్యాధునిక స్పోర్ట్స్ స్టేడియంలు, శిక్షణా కేంద్రాల నిర్మాణానికి మీ డిజైన్ సహకారం అందించండి. పర్యావరణ హితమైన, ఇంధన సామర్థ్యం గల క్రీడా, వినోద వేదికల నిర్మాణంలో ప్రభుత్వంతో కలిసి పనిచేయాలి" అని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు కమ్యూనిటీ క్రీడా సముదాయాలు, పర్యాటకాన్ని, స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా ఇంటిగ్రేటెడ్ ఈవెంట్ స్పేస్‌ల రూపకల్పనలో కూడా భాగస్వాములు కావాలని ఆయన ఆహ్వానించారు.

## గల్ఫ్ ప్రవాసులకు అండగా 'ప్రవాసాంధ్ర భరోసా'

**మొదటిపేజీ తరువాయి** – కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తుందని తెలిపారు. కష్టకాలంలో వారిని ఆదుకునేందుకే ఈ పథకాన్ని రూపొందించినట్లు ఆయన వివరించారు.సీఎం పర్యటన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ప్రవాసీయులతో భారీ సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వివిధ గల్ఫ్ దేశాల నుంచి టీడీపీ అభిమానులు, ప్రముఖులు, ప్రవాసాంధ్రులు దుబాయ్‌కు చేరుకుంటున్నారు.

## పాక్‌లో ధరల మంట
## కిలో టమాటా రూ. 600, అల్లం రూ. 750!

**మొదటిపేజీ తరువాయి** – పునరుద్ధరించబడే వరకు ధరలు తగ్గే అవకాశం లేదు" అని ఆయన స్పష్టం చేశారు.టమాటాలే కాకుండా ఇతర కూరగాయల ధరలు కూడా మండిపోతున్నాయి. కిలో అల్లం ధర రూ. 750కి చేరగా, వెల్లుల్లి రూ. 400, బఠాణీలు రూ. 500 పలుకుతున్నాయి. ఉల్లిపాయల ధర కిలోకు రూ. 120కి పెరిగింది. క్యాప్సికమ్, బెండకాయలు కిలో రూ. 300 చొప్పున అమ్ముతున్నారు. గతంలో ఉచితంగా ఇచ్చే కొత్తిమీర చిన్న కట్ట ఇప్పుడు రూ. 50కి చేరిందని స్థానిక మీడియా పేర్కొంది. పండ్ల ధరలు కూడా ఇదే స్థాయిలో ఉన్నాయి. యాపిల్స్ కిలో రూ. 250 నుంచి 350, ద్రాక్ష రూ. 400 నుంచి 600 వరకు అమ్ముతున్నారు.ధరలు విపరీతంగా పెరగడంతో చాలా మంది చిరు వ్యాపారులు టమాటాలు, బఠాణీలు, అల్లం, వెల్లుల్లి వంటివి అమ్మడం మానేశారు. పాకిస్థాన్ ఇటీవల ఆఫ్ఘన్ భూభాగంపై వైమానిక దాడులు చేయడం, ఆ దేశ శరణార్థులను బలవంతంగా వెనక్కి పంపడం వంటి పరిణామాల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఈ ఉద్రిక్తతలే ప్రస్తుతం నిత్యావసరాల సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇరాన్ నుంచి దిగుమతి చేసుకునే కూరగాయల కంటే వాఘా సరిహద్దు ద్వారా భారత్ నుంచి వచ్చే కూరగాయలు చౌకగా లభిస్తాయని ఓ వ్యాపారి చెప్పినట్లు స్థానిక పత్రికలు నివేదించాయి.

## మేడారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ములుగు జిల్లా మేడారం జాతరలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవార్లను దర్శించుకున్నారు.భక్తి శ్రద్ధలతో నిలువెత్తు బంగారాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.సీఎం పర్యటనలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు వెంట ఉన్నారు.అనంతరం మేడారం ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించనున్నారు. తులాభారంలో 68 కేజీలు తూగిన సీఎం రేవంత్ రెడ్డి, మేడారంలో సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్న సందర్భంగా తులాభారం వేయగా 68 కిలోల బరువు తూగిన సీఎం రేవంత్ రెడ్డి దీంతో అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించి, మొక్కు తీర్చుకున్న రేవంత్.

# ఉస్మా'నయా' హాస్పిటల్ రెండేళ్లలో పూర్తి కావాలి

**మొదటిపేజీ తరువాయి** – తన నివాసంలో హాస్పిటల్ నూతన భవనాల నిర్మాణం, అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి బుధవారం సమీక్ష నిర్వహించారు. హాస్పిటల్ పనులతోపాటు స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. పనుల వేగవంతానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని, ఈ కమిటీ క్షేత్రస్థాయిలో ప్రతి పది రోజులకోసారి సమావేశమై సమస్యలుంటే పరిష్కరిం చుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. నిర్మాణం పూర్తయ్యాక అక్కడి బందోబస్తు, ట్రాఫిక్ విధుల నిర్వహణకు సంబంధించి ముందుస్తుగానే తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని పోలీసు



శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. హాస్పిటల్‌కు వివిధ రహదారులను అనుసంధానించే ప్రణాళికలు ఇప్పటి నుంచే రూపొందించాలని ఆర్అండ్‌బీ అధికారులకు సీఎం సూచించారు. హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లో హాస్పిటల్స్, మెడికల్ కళాశాలల నిర్మాణానికి సంబంధించి ప్రతి నిర్మాణానికీ ఒక అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిర్మాణాలపై 24/7 అధికారి పర్యవేక్షించేలా పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగించాలని సూచించారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, డీజీపీ శివధర్ రెడ్డి, ఆర్ అండ్ బి స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తూ, ఎంఏ అండ్ యూడీ సెక్రటరీ ఇలంబర్తి, ముషారఫ్ అలీ ఫరూఖీ, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలోని అన్ని చెక్ పోస్టులు రద్దు

**మొదటిపేజీ తరువాయి** – రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రవాణా శాఖ చెక్‌పోస్టులను తక్షణమే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సీఎం ఆదేశాల మేరకు రవాణా శాఖ ఈ నిర్ణయాన్ని వెంటనే అమలు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.రవాణా శాఖ కమిషనర్ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం, సాయంత్రం 5 గంటలలోగా రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టుల కార్యకలాపాలను పూర్తిగా నిలిపివే యాలని జిల్లా రవాణా అధికారులు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లను ఆదేశించారు. ఆగస్టు 28, 2025న విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వు (G.O. Ms. No. 58) ప్రకారం ఈ చర్యలు తీసుకుం టున్నట్లు స్పష్టం చేశారు.ఈ ఆదేశాల ప్రకారం, రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూసేందుకు చెక్‌పోస్టుల వద్ద ఉన్న బోర్డులు, బారికేడ్లు, ఇతర సూచికలను పూర్తిగా తొలగించాలని సూచించారు. ఈ తొలగింపు ప్రక్రియను తప్పనిసరిగా వీడియో తీసి, నివేదికతో పాటు ఉన్నతాధికారులకు పంపాలని స్పష్టం చేశారు. చెక్‌పోస్టుల మూసివేత ప్రక్రియ సాయంత్రం 5 గంటల లోపు పూర్తి కావాలని గడువు విధించారు. ప్రస్తుతం చెక్‌పోస్టులలో పనిచేస్తున్న సిబ్బందిని వారి సంబంధిత జిల్లా రవాణా కార్యాలయాలకు పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా, చెక్‌పోస్టులలో ఉన్న ఫర్నిచర్, రికార్డులు, పరికరాలు, ఇతర వస్తువులను వెంటనే డీటీవో కార్యాలయాలకు తరలించాలని తెలిపారు. క్యాష్ బుక్కులు, రసీదులు, చలాన్లతో సహా అన్ని ఆర్థిక, పరిపాలనా రికార్డులను సరిచూసి భద్రపరచాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల మూసివేత సమాచారాన్ని వాహనదారులకు తెలియజే సేందుకు సంబంధిత ప్రాంతాల్లో పబ్లిక్ నోటీసులు ప్రదర్శించాలని కమిషనర్ సూచించారు. సిబ్బంది పునర్నియామకం, రికార్డుల తరలింపు, చెక్‌పోస్టుల పూర్తి



మూసివేతపై సమగ్ర నివేదికను సాయంత్రం 5 గంటల లోపు తమ కార్యాలయానికి సమర్పించాలని కమిషనర్ స్పష్టం చేశారు.

# ఏపీకి పెట్టుబడులే లక్ష్యంగా తొలిరోజు భేటీలు

**మొదటిపేజీ తరువాయి** – ఆంధ్రప్రదేశ్‌కు భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు తన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటనను ప్రారంభించారు. పర్యటనలో భాగంగా తొలిరోజైన బుధవారం ఆయన దుబాయ్‌లో పారిశ్రామికవేత్తలు, భారత రాయబార కార్యాలయ అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న విస్తృత అవకాశాలను వారికి వివరించి, ఏపీకి రావాల్సిందిగా ఆహ్వానించనున్నారు.తొలిరోజు పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు, దుబాయ్‌లోని భారత కాన్సుల్ జనరల్ సతీశ్ కుమార్ శివన్, అబుదాబీలోని డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్నాథ్‌లతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, పోర్టులు, లాజిస్టిక్స్, రియల్ ఎస్టేట్, డేటా సెంటర్లు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో ఉన్న పెట్టుబడి అవకాశాలను ఆయన వారికి వివరించారు. విశాఖపట్నంలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఏఐ డేటా హబ్ ఏర్పాటు



చేయనుందన్న విషయాన్ని ఈ సమావేశంలో ప్రస్తావించారు. రాష్ట్రానికి ఉన్న 1054 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామని తెలిపారు.పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం ద్వారా తమ ప్రభుత్వం వేగంగా అనుమతులు మంజూరు చేస్తోందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. యూఏఈలోని వివిధ సావరిన్ ఫండ్స్ నుంచి ఏపీకి పెట్టుబడులను ఆకర్షించే అంశంపై కూడా ఈ భేటీలో ప్రత్యేకంగా చర్చించారు. ఇదే సమయంలో, యూఏఈలో నివసిస్తున్న తెలుగు ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సీఎం చంద్రబాబు ఎంబసీ అధికారులను కోరారు.ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. "ప్రధాని మోదీ కృషితోనే భారత్‌లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. ఆయన ప్రపంచవ్యాప్తంగా భారతదేశ బ్రాండ్‌ను ప్రచారం చేస్తున్నారు. ఆయన వల్లే భారత్-యూఏఈ మధ్య వాణిజ్య, పెట్టుబడుల సంబంధాలు బలపడ్డాయి" అని చంద్రబాబు అన్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు.

# ఉగ్రవాదంపై కలిసి పోరాడదాం

**మొదటిపేజీ తరువాయి** – అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీతో తాను ఫోన్‌లో మాట్లాడానని, పలు కీలక అంశాలపై ఆయన హామీ ఇచ్చారని ట్రంప్ ప్రకటించగా, అలాంటి ఫోన్ కాల్ ఏదీ జరగలేదని భారత ప్రభుత్వం స్పష్టం చేయడంతో గందరగోళం నెలకొంది.వైట్‌హౌస్‌లో జరిగిన దీపావళి వేడుకల సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, "నేను ఈరోజే మీ ప్రధానమంత్రితో మాట్లాడాను. మా మధ్య గొప్ప సంభాషణ జరిగింది. వాణిజ్యంతో పాటు అనేక విషయాలు చర్చించాం" అని విలేకరులతో అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ గణనీయంగా తగ్గిస్తుందని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ పునరుద్ఘాటించారు. అంతేకాకుండా, గతంలో భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తాను ఆపగలిగానని మరోసారి వ్యాఖ్యానించారు.అయితే, ట్రంప్ చేసిన ఈ ప్రకటనలను భారత ప్రభుత్వం తోసిపుచ్చింది. ప్రధాని మోదీకి, ట్రంప్‌కు మధ్య జరిగిన దీపావళి ఫోన్ సంభాషణలో ఇలాంటి అంశం ప్రస్తావనకు రాలేదని స్పష్టం చేసింది. ఇంధన దిగుమతులపై భారత్ తన ప్రయోజనాలను కాపాడుకుంటుందని, వినియోగదారుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని పరోక్షంగా ఓ ప్రకటన విడుదల చేసింది.మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ ఆన్‌లైన్‌లో ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దీపావళి శు




భాకాంక్షలు తెలిపినందుకు ధన్యవాదాలు చెబుతూనే, ఆయన వ్యూహాత్మకంగా స్పందించారు. "మీ ఫోన్ కాల్, దీపావళి శుభాకాంక్షలకు ధన్యవాదాలు. ఈ వెలుగుల పండుగ సందర్భంగా మన రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాలు ప్రపంచానికి ఆశాకిరణంగా నిలవాలి. అన్ని రకాల ఉగ్రవాదంపై కలిసికట్టుగా పోరాడాలి" అని తన పోస్టులో పేర్కొన్నారు. ఉగ్రవాదంపై పోరాటానికి ప్రాధాన్యం ఇస్తూ మోదీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# డీప్‌ఫేక్, ఏఐ కంటెంట్ దుర్వినియోగాన్ని అరికట్టడానికి కేంద్రం కీలక సవరణలు

### డీప్‌ఫేక్, ఏఐ-జనరేటెడ్ కంటెంట్‌ను ట్రేస్ చేయడమే లక్ష్యంగా
### ఐటీ రూల్స్‌లో మార్పులు!

జనరేటివ్ ఏఐ, డీప్‌ఫేక్ టెక్నాలజీల దుర్వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 22నల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యంతర మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) రూల్స్, 2021కి పలు సవరణలు ప్రతిపాదిస్తూ, ఓ ముసాయిదాను విడుదల చేసింది.దీని ప్రకారం, సోషల్ మీడియా వేదికల్లో కృత్రిమంగా రూపొందిన కంటెంట్‌ను స్పష్టంగా లేబులింగ్ చేయాల్సి ఉంటుంది. సింపుల్‌గా చెప్పాలంటే, కృత్రిమమేధ (ఏఐ) ద్వారా తయారు చేసిన కంటెంట్?, డీప్‌ఫేక్ కంటెంట్ అని సదరు వీడియో లేదా ఆడియో గురించి స్పష్టంగా చెప్పాల్సి ఉంటుంది. ఇందుకోసం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్ ఇంటర్‌మీడియరీస్ (ఎస్ఎస్ఎంఐ) తప్పనిసరిగా లేబులింగ్?, మెటాడేటా ట్యాగింగ్,




విజిబిలిటీ ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. వీడియో అయితే కనిపించే విధంగా, ఆడియో అయితే వినిపించే విధంగా ఏఐ, డీప్‌ఫేక్ కంటెంట్ అని స్పష్టంగా లేబుల్ చేయవలసి ఉంటుంది.భారత్‌లో 5 మిలియన్లకు పైగా నమోదిత వినియోగదారులు కలిగిన ఎస్ఎస్ఎంఐలు ఉన్నాయి. వీటిలో ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్ మొదలైన ప్లాట్ ఫారమ్స్‌లు 2021 ఐటీ నిబంధనల ప్రకారం అదనపు సమ్మతికి బాధ్యత వహించాల్సి ఉంటుంది.ప్రతిపాదిత ఐటీ నియమం 3(3) ప్రకారం, కృత్రిమంగా తయారు చేసిన కంటెంట్‌ను సృష్టించడానికి వీలు కల్పించే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు కొన్ని నిబంధనలను కచ్చితంగా పాటించాలి. అవి ఏమిటంటే, ఏఐ, డీప్‌ఫేక్ కంటెంట్‌కు కచ్చితంగా 'శాశ్వతమైన ప్రత్యేక మెటాడేటా లేదా ఐడెంటిఫైయర్'తో లేబులింగ్ పొందుపరిచేలా చూసుకోవాలి. పైగా ఆ ఐడెంటిఫైయర్ స్పష్టంగా కనిపించేలా లేదా వినగలిగేలా ఉండాలి.ముఖ్యంగా "విజువల్ డిస్‌ప్లే అయితే దాని ఉపరితల వైశాల్యంలో కనీసం 10 శాతం ఐడెంటిఫైయర్ కనిపించాలి. ఒకవేళ అది ఆడియో అయితే దాని మొత్తం వ్యవధిలో కనీసం 10 శాతాన్ని కవర్ చేసేలా ఉండాలి. అంతేకాదు మెటా డేటా లేదా ఐడెంటిఫైయర్‌ను మార్చకూడదు. సప్రెస్ చేయడం, తీసివేయడం లాంటివి చేయకూడదు" అని ముసాయిదా నియమాలు స్పష్టం చేస్తున్నాయి.మరోవైపు సింథటిక్ కంటెంట్ సృష్టించడానికి లేదా సవరించడానికి వీలు కల్పించే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు- అప్‌లోడ్ చేసిన కంటెంట్ ఏఐ ద్వారా సృష్టించబడిందని ధ్రువీకరించడానికి, ప్రకటించడానికి తగి సాంకేతిక మార్పులు, చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది అని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పేర్కొంది.

# శబరి గిరుల్లో చారిత్రక ఘట్టం.. ఇరుముడితో పడిమెట్లెక్కిన రాష్ట్రపతి.. శబరిమలలో ముర్ము ప్రత్యేక పూజలు

### శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము




శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం ఒక చారిత్రక ఘట్టానికి వేదికైంది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం స్వామివారిని దర్శించుకున్నారు. తద్వారా, ఈ ప్రఖ్యాత పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన తొలి మహిళా దేశాధినేతగా ఆమె చరిత్ర సృష్టించారు. గతంలో 1970లలో మాజీ రాష్ట్రపతి వీవీ గిరి శబరిమలను సందర్శించగా, ఆ తర్వాత అయ్యప్పను దర్శించుకున్న రెండో భారత రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము నిలిచారు.కేరళలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆమె శబరిమలకు చేరుకున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు పంబా బేస్ క్యాంపు వద్దకు వచ్చిన ఆమె, మొదట పంపా నదిలో పాదాలను శుభ్రం చేసుకుని, సమీపంలోని గణపతి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం నల్ల చీర ధరించి సంప్రదాయబద్ధంగా 'కెట్టునిర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆమె 'ఇరుముడికెట్టు'ను సిద్ధం చేశారు. రాష్ట్రపతితో పాటు ఆమె అల్లుడు గణేష్ చంద్ర హెూంబ్రామ్, ఇతర సిబ్బంది కూడా ఇరుముడిని సిద్ధం చేసుకున్నారు.పంబ నుంచి ప్రత్యేక వాహనంలో సన్నిధానానికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ తంత్రి కందరారు మహేష్ మోహనారు 'పూర్ణకుంభ' స్వాగతం పలికారు.



రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి వీఎన్ వాసవన్ కూడా ఆమెకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ద్రౌపది ముర్ము పవిత్రమైన ఇరుముడిని తలపై పెట్టుకుని, 18 మెట్లను ఎక్కి అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఆమె ఇరుముడిని ప్రధాన అర్చకులు తీసుకుని పూజలు నిర్వహించారు. ఆ తర్వాత మాలికాపురం ఆలయాన్ని కూడా ఆమె సందర్శించారు.రాష్ట్రపతి పర్యటనపై బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "ఆమె వయసు 67. ఆమె ఏ నిబంధనలను ఉల్లంఘించలేదు, ఏ విశ్వాసాన్ని గాయపరచలేదు – కేవలం గౌరవించారు. ఇరుముడితో అయ్యప్పను దర్శించుకున్న తొలి రాష్ట్రపతిగా నిలిచారు" అని ఆయన పేర్కొన్నారు. "భక్తి అనేది నిశ్శబ్దంగానే నిలబడుతుందని ఈ పర్యటన గుర్తుచేసింది. కోట్లాది అయ్యప్ప భక్తులను ఏకం చేసే విశ్వాసానికి ఈ క్షణం అద్దం పడుతోంది" అని ఆయన తన పోస్టులో రాశారు.మహిళల ప్రవేశంపై 2018లో సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఒక మహిళా దేశాధినేత ఆలయాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, రాష్ట్రపతి పర్యటన సందర్భంగా సాధారణ భక్తుల ప్రవేశాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు అధికారులు తెలిపారు.

## ప్రణవన్న సారధ్యంలో నెరవేరిన దశాబ్దాల కల

### నూతన బస్ సర్వీస్ ను ప్రారంభించిన వొడితల ప్రణవ్.





**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి అక్టోబర్ 22 :** వీణవంక మండలం బేతిగల్ గ్రామంలో హుజురాబాద్ బస్ డిపో పరిధిలోనీ జమ్మికుంట నుండి బేతిగల్, కేశవపట్నం మీదుగా కరీంనగర్ వెళ్ళే నూతన బస్ సర్వీస్ ను ప్రారంభించిన హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ గారు.30 ఏళ్ల తర్వాత గ్రామానికి బస్ సౌకర్యం కల్పించడంతో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్న గ్రామస్థులు..ఇందుకు కృషి చేసిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి, మంత్రులకు, హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ఆర్థిక సహాయం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు



**చండూరు, తెలంగాణ సేన:** చండూరు మండల పరిధిలోని గుండ్రపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త కురుపాటి నాగేష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందడం జరిగింది. దీంతో విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు వారి కుటుంబ సభ్యులను పరమార్శించి కార్యకర్తలకు బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా తెలిపారు. అనంతరం మండల కమిటీ ఆధ్వర్యంలో 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎత్తపు మధుసూదన్ రావు, బిఆర్ఎస్ చండూరు మండల పార్టీ యువజన అధ్యక్షులు ఉజ్జిని అనిల్ రావు, బొడ్డు సతీష్ గౌడ్,ఉపాధ్యక్షులు కురుపాటి సుదర్శన్, గుండ్రపల్లి గ్రామ శాఖ యూత్ అధ్యక్షులు కురుపాటి లింగస్వామి, పెండ్యాల ఉపేందర్, ఎల్వర్తి జంగయ్య, తరి సురేష్, సాప్రాట్ కిరణ్,దామర అనిల్, బుషిపాక శివ, మహేశ్వర వెంకన్న, వెంకన్న, మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వేముల ఆగమ్మ గౌడ్ కు గౌడ సంఘాల నాయకులు నివాళులు



**తెలంగాణసేన :** నర్సంపేట పట్టణానికి చెందిన వేముల ఆగమ్మ గౌడ్ అనారోగ్యంతో ఇటీవల స్వర్గస్తులయ్యారు. విషయం తెలిసిన గౌడ సంఘాల నాయకులు బుధవారం ఆగమ్మ గౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. కీ శే.ఆగమ్మ మనుమలు రాజు గౌడ్, వెంకటేశ్వర్లు గౌడ్ లను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్, గౌడ సంఘాల నాయకులు సొల్తీ సారయ్య గౌడ్, గోడిశాల సదానందం గౌడ్, మచ్చిక రాజు గౌడ్, మద్దెల సాంబయ్య గౌడ్, గోపగాని వెంకట్ గౌడ్, పట్టణ గౌడ సంఘం అధ్యక్షులు కోల వెంకటేశ్వర్లు గౌడ్, కోశాధికారి గిరాగాని కిరణ్ గౌడ్, తాళ్లపెల్లి చంద్రమౌళి గౌడ్, వేముల శ్రీనివాస్ గౌడ్, వేముల కృష్ణ ప్రసాద్ గౌడ్,వేముల గోపి గౌడ్,వేముల సాగర్ గౌడ్,పోశాల రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మేడి లక్ష్మి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు

### లక్ష్మి పార్థివదేహానికి పూలమాల వేస్తున్న జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్



**తెలంగాణసేన :** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట మండలం పాపయ్యపేట మాజీ ఉప సర్పంచ్ మేడి వెంకటేశ్వర్లు గౌడ్ తల్లి, బీసీ సంక్షేమ సంఘం గ్రామ అధ్యక్షుడు మేడి సాయికృష్ణ గౌడ్ నానమ్మ మేడి లక్ష్మి అనారోగ్యంతో మరణించగా బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ లక్ష్మి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నూరి రవి ముదిరాజ్, జిల్లా అధికార ప్రతినిధి మరుపల వీరస్వామి కురుమ, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య, చెన్నారావుపేట గ్రామ ఉపాధ్యక్షుడు చెన్నూరి స్వామి ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కందాల వెంకటేశ్వర్లు, కోశాధికారి మేడి సంతోష్ గౌడ్, కత్తి స్వామి గౌడ్, మీరాల కుమారస్వామి కురుమ, తాళ్ళ సమ్మయ్య గౌడ్, మాచర్ల సమ్మయ్య గౌడ్, బుడిగె నాగయ్య గౌడ్, అన్నెబోయిన అనిల్ ముదిరాజ్, ఎదరబోయిన ఉప్పలయ్య ముదిరాజ్ లు పూలు వేసి నివాళులు అర్పించారు.

## వేములవాడ రాజన్న ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవం ప్రారంభం







**వేములవాడ అక్టోబర్ 22 (తెలంగాణ సేన) :** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు తేది: 22-10-2025 (బుధవారం) నుండి తేది: 20-11-2025 (గురువారం) వరకు సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించారు. రాజన్న దేవాలయంలో సేవా సమితి సభ్యులు భక్తి గీతాలు, భజనలతో భక్తులను అలరించారు. కార్తీక మాస పర్వదినాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమం ప్రతి రోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినీల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతుందని అధికారులు తెలిపారు

## రాజన్నను దర్శించుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సతీమణి





**వేములవాడ, అక్టోబర్ 22 (తెలంగాణ సేన) :** వేములవాడలోని శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ సతీమణి శ్రీమతి అపర్ణ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణ మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. వారికి ఆలయ ఈవో శ్రీమతి ఎల్. రమాదేవి స్వామి అమ్మవార్ల వస్త్రాలు, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

# కోతుల.. కుక్కల... బెడదను నివారించాలి..!

### చిన్నపిల్లలను కరుస్తున్న పట్టించుకోని అధికారులు..?

### సిపిఐ(ఎం) మండల నాయకులు కందాల రమేష్,



**డోర్నకల్ ,తెలంగాణ సేన ప్రతినిధి :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో ఉన్న 48 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 15 వార్డులలో కోతులు, కుక్కల బెడద విపరీతంగా పెరిగిందని, వాటిని నివారించాలని సిపిఐ(ఎం) మరిపెడ మండల నాయకులు కందాల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. కోతుల వల్ల అనేక గ్రామాలలో రైతులు పంటలు వేసుకునే పరిస్థితులు కోల్పోతున్నారని, పొట్టకు వచ్చిన వరి పొలాన్ని సైతం పీకేస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు ఒంటరిగా వెళ్లాలంటే గ్రామాలలో, పట్టణాలలో కోతులతో ప్రాణ భయం ఉందని పేర్కొన్నారు. చాలామంది పిల్లల పైన దాడులు చేసి ఇంట్లో ఉన్న ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయని తెలిపారు. వాటి వల్ల రానున్న రోజుల్లో మానవాళికి పెను ప్రమాదం పొంచి ఉందన్నారు.ఒంటరిగా వస్తున్న పిల్లలపైన కుక్కలు దాడి చేస్తూన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ పరిపాలన వ్యవస్థ రోజురోజుకు దిగజారి పోవడంతో గ్రామాలలో జరుగుతున్న పరిణామాలకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి వెంటనే వాటి నివారణకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనియెడల రైతులు ప్రజలను సమీకరించి గ్రామ గ్రామాన ఆందోళన పోరాటాలు చేస్తామని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

### వేములవాడ రూరల్ ఎస్ ఐ వెంకట్రాజం

### అమరుల త్యాగఫలం వలనే మనం ఈరోజు స్వేచ్ఛ స్వతంత్రంగా జీవిస్తున్నాం వేములవాడ రూరల్ సర్కిల్ ఇ?న్స్పెక్టర్ శ్రీనివాస్







**వేములవాడ, అక్టోబర్ 22 (తెలంగాణ సేన) :** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) కార్యక్రమాల్లో భాగంగా వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని,చెక్కపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్నారు అని రూరల్ ఎస్ ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీసు చట్టాల గురించి, సీసీ కెమెరాల వల్ల కలిగే ఉపయోగాల గురించి, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్మెంట్, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి మరియు సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ ఎస్ ఐ వెంకట్రాజం మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాల గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు మరియు ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని మరియు రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని సైబర్ నేరాల వలలో పడకుండా తీసుకోవలసిన జాగ్రత్త చర్యల గురించి విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఉత్సహకంగా పాల్గొన్నారు.

గంజాయి,డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి, డయల్ 100, సైబర్ నేరం జరగగానే 1930 టోల్ ఫ్రీ నెంబర్ ల గురించి కూడా అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేములవాడ రూరల్ మండల విద్యాధికారి కిషన్, ఉపాధ్యాయులు, వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఏ ఎస్ ఐ మజీద్, బాపు రెడ్డి హెడ్ కానిస్టేబుల్, రిసెప్షన్ కానిస్టేబుల్ శంకర్, సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ రాజశేఖర్, అసిస్టెంట్ రైటర్ లహరి ప్రియా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోలీసు శాఖ పనితీరు, ట్రాఫిక్ నియమాలపై 'ఓపెన్ హౌస్'

### సమాజంలో బాధ్యత గల పౌరులుగా మారేందుకు పునాది

### ఇన్స్పెక్టర్ వీరా ప్రసాద్



**వేములవాడ, అక్టోబర్ 22 (తెలంగాణ సేన) :** వేములవాడ పోలీస్ స్టేషన్లో ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వీరా ప్రసాద్, ఆర్ఎస్ఐ రాజు మరియు ఇతర సిబ్బందితో కలిసి విద్యార్థుల కోసం 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం విద్యార్థులకు పోలీసు శాఖ యొక్క పనితీరు, విధులు మరియు ముఖ్యంగా ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడమే.ఈ సందర్భంగా, పాఠశాల విద్యార్థులు పోలీస్ స్టేషన్ను సందర్శించారు. పోలీసులు నిర్వర్తించే విధులు, వారి బాధ్యతలు, నేర నివారణకు వారు తీసుకునే చర్యల గురించి అధికారులు విద్యార్థులకు వివరంగా తెలియజేశారు. అలాగే, రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి, ట్రాఫిక్ నియమాలు, వాటిని పాటించాల్సిన ఆవశ్యకత మరియు రోడ్డు ప్రమాదాలను నివారించే పద్ధతులను ప్రదర్శనలు మరియు చర్చల రూపంలో వివరించారు. ఈ 'ఓపెన్ హౌస్' ద్వారా పిల్లలలో చిన్ననాటి నుంచే పౌర బాధ్యతా భావం మరియు భద్రత పట్ల అవగాహన పెంచే ప్రయత్నం జరిగింది. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని, పోలీసు అధికారులను తమ సందేహాలను అడిగి, అధికారుల నుంచి సమాధానాలు పొందారు.

## రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

### అనుపురంలో ధాన్యం కొనుగోలు ప్రారంభం





**వేములవాడ, అక్టోబర్ 22 (తెలంగాణ సేన) :** రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది అని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.. వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామంలో ఫ్యాక్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇస్తూ కొనుగోలు చేస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వంలో రైతులకు నాణ్యమైన విద్యుత్, ఎరువులు,మేలైన వంగడాలను ప్రభుత్వం తరుపున అందిస్తున్నామని తెలిపారు. రైతులకు ఏక కాలంలో రైతు ప్రయోజనాలు కోసం 20 వేల కోట్ల మేర రుణమాఫీ చేయడం జరిగిందని వెల్లడించారు.కొనుగోలు చేసిన ధాన్యం పంపిణీ చేయడం కోసం అదనంగా నూతన లారీ ఏజెన్సీలకు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

## ఎంబీబీఎస్ లో సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



**ముధోల్, అక్టోబర్22:తెలంగాణ సేన న్యూస్ :**ముధోల్ కు చెందిన నారాయణ (ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ సబ్ ఇంజనీర్) కూతురు కుమారి అక్షయ నీట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి నోవా మెడికల్ కాలేజ్ హైదరాబాదులో మెడిసిన్ సీటు సాధించింది. ఈ సందర్భంగా నారాయణ మిత్రబృందం కుమారి అక్షయ మరియు తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేస్తూ శాలువతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఇలాగే ఉన్నత చదువులు చదివి మరింత ఉన్నత స్థానంలో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఇందులో మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్, సాయినాథ్. నారాయణ.నగేష్. నరేందర్. తదితరులు ఉన్నారు.

## మాగంటి సునీత వేసిన 4 నామినేషన్లను అంగీకరించిన రిటర్నింగ్ ఆఫీసర్..?



**తెలంగాణ సేన న్యూస్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత వేసిన నాలుగు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ ఆఫీసర్ పరిశీలించి అన్నింటినీ చెల్లుబాటు అయ్యినవిగా అంగీకరించారు. నామినేషన్ పరిశీలన సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.అభ్యర్థి మాగంటి సునీత మాట్లాడుతూ."పార్టీ నాయకత్వం నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాను. ప్రజా ఆశీర్వాదంతో విజయం సాధిస్తా" అని తెలిపారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మాగంటి సునీత అధికారిక అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

## రైతుల అభ్యున్నతికి కృషి




**ముధోల్: 22అక్టోబర్(తెలంగాణ సేన న్యూస్).** : రైతుల అభ్యున్నతికి నిరంతరంగా కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ముధోల్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనిగ విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు శనిగ విత్తనాలను సబ్సిడీ ద్వారా 25 కిలోల బస్తా రూ.1500 తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం అనేక పథకాలను ప్రవేశం పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు రావు పటేల్, మండల వ్యవసాయ అధికారి రచన, మండల బిజెపి అధ్యక్షులు కోరీ పోతన్న, నాయకులు లక్ష్మీ నర్సాగౌడ్ గౌడ్ తాటివార్ రమేష్,దేవోజీ భూమేష్. మోహన్ సతీష్ రెడ్డి. రావుల శ్రీనివాస్. జీవన్ పాల్గొన్నారు

## నీట్ లో సీట్ సాధించిన విద్యార్థినికి ఘన సన్మానం



**ముధోల్ అక్టోబర్ 22 : తెలంగాణ సేన న్యూస్ :** ముధోల్ :మండల కేంద్రానికి చెందిన ఎలక్ట్రికల్ సబ్ ఇంజనీర్ జీ నారాయణ కుమార్తె అక్షయ నీట్ లో ప్రతిభ కనబరిచి సీటు సాధించినందుకు రబింద్ర ఉన్నత పాఠశాల యాజమాన్యం అక్షయను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్ మాట్లాడుతూ...నీట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విధంగా భవిష్యత్తులో ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రుల పేర్లు నిలబెట్టాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అసంవార్ సాయినాథ్. కరస్పాండెంట్ రాజేందర్. చైర్మన్ భీమ్రావు దేశాయ్. డైరెక్టర్ పోతన్న యాదవ్. ఉపాధ్యాయులు. తదితరులు పాల్గొన్నారు.

## సోయా కొనుగోల కేంద్రాలు ఎప్పుడు



**తెలంగాణ సేన అక్టోబర్ 22( బాసర (ప్రతినిధి) :** నిర్మల్ జిల్లా : బాసర అధిక వర్షాలు ఎదవ నుంచి వస్తున్న వరదతో ప్రతి ఏటా గోదావరి నది నీరు నిండుకుండల మారుతుంది.దీంతో దిగువన ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ భూములు వేల ఎకరాల వరకు వరద వల్ల వరి, సోయా,పత్తి పంటలు నీట మునిగాయి నష్టపోయిన పంటలను వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్న పరిహారం మాత్రం అందడం లేదని పలువురు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గత 15 రోజులుగా రైతులు చేతికి వచ్చిన సోయాను కల్లాల వద్ద కుప్పలు కుప్పలుగా ఆరబోసినప్పటికీ ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు చేపట్టలేదని రైతులు వాపోతున్నారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
గురువారం 23-10 - 2025

# మంత్రులు ఎంపీపై మాట్లాడే నైతిక అర్హత గాదరి కిషోర్ కు లేదు

కాంగ్రెస్ నేతలు చింత ధనంజయ

,వేముల గోపీనాథ్



**తెలంగాణ సేన న్యూస్:** నల్గొండ జిల్లా శాలిగౌరారం: హైదరాబాద్ లోని బీఆర్ ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డి పై, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పై, మంత్రి అద్దూరి లక్ష్మణ్ పై, మంత్రి కొండ సురేఖ పై చేసిన వ్యాఖ్యల పట్ల శాలిగౌరారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నల్గొండ జిల్లా నాయకులు చింత ధనంజయ మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలు ప్రజలు 50 వేల పైచిలుకు మెజార్టీతో ఓకొట్టిన కూడా బుద్ధి రాలేదని ఎద్దవా చేశారు..కాంగ్రెస్ పార్టీ సీఎం, మంత్రులపై ఎంపీపై మాట్లాడిన తీరు నీ భాష మార్చుకోవాలని లేకుంటే తుంగతుర్తి నియోజకవర్గంలో అడుగు కూడా పెట్టనీయమనిక్ హెచ్చరించారు. తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ మాట్లాడుతూ చదువుకున్న వ్యక్తిగా సంస్కారం లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని ప్రజలు తగిన బుద్ధి చెప్పక తప్పదని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గం లో రెండుక్ పర్యాయాలుగా ఎమ్మెల్యేగా ఉండి అవినీతి ఇసుక మాఫియా దొంగ నోట్ల వ్యాపారం అక్రమాలకు పాల్పడినందుకే ప్రజలు బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గూని వెంకటయ్య ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బోడ అరుణ్ కుమార్ మాజీ మండల అధ్యక్షులు పెరమాండ్ల నరేష్ మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గం లో దొంగ నోట్ల కిషోర్, భూకబ్జాల కిషోర్, నయీమ్ గ్యాంగ్ కిషోర్, హంతకుడు కిషోర్, ఇసుక మాఫియా కిషోర్ అని అంటారని, నీకు లేని ముద్రలు లేవని ఘాటుగా విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ హయంలో నియోజకవర్గంలో నువ్వు చేసిన అవినీతి పట్ల ప్రజలు తిరస్కరించి పంపించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులపై ఏ ఒక్కరిపై కూడా మాట్లాడే అర్హత నీకు లేదని మండిపడ్డారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పై మంత్రి అద్లూరి లక్ష్మణ్ పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తుంగతుర్తి నియోజకవర్గం సోషల్ మీడియా కోఆర్డినేటర్ వేముల భరత్ ,నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అన్నే బోయిన అనిల్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు తోటకూరి పరుశరాములు, కోక సాయి, ఇంద్రకంటి యాదయ్య, సుల్తాన్ వెంకన్న ,తాటిపాముల రవి ,జినగ మధు, గుండ్లపల్లి సైదులు,బట్ట లక్ష్మణ్,ఏసుదాసు,మిర్యాల సాయి ,బందెలా ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి భీమన్న ఆలయాన్ని కబ్జా చేస్తున్న గిరిజన నేతరులను వెంటనే అరెస్టు చేయాలి

: తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు

వెంకగారి భూమయ్య

తుడుందెబ్బఆధ్వర్యంలో ఘనంగా

కొమరం భీమ్ జయంతి వేడుకలు.




**నిర్మల్ :అక్టోబర్ 22:తెలంగాణ సేన న్యూస్.:** నిర్మల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు, రిలయన్స్ సూపర్ మార్కెట్ పక్కన ఉన్న కొమరం భీం విగ్రహాలకు తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఘనంగా కొమురం భీం 124 వ జయంతి ఉత్సవాలు ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో మామడ మండలంలోని పోతారం గ్రామంలో ఆదివాసి ఆరైద్య దేవుడు భీమన్న ఆలయాలపై గిరిజన నేతరుల పెత్తనాన్ని సహించేది లేదని, వెంటనే వారి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు, నిర్మల్ జిల్లా కేంద్రంలో మ్యూజియం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వలస లంబాడీలను తొలగించాలని లేదంటే నిర్మల్ లో మరో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.గోండు బెబ్బులి ఆదివాసుల ఆరాధ్య దైవం కొమరం భీమ్ చేసిన నినాదంతోనే మన జాతి ఉద్యమాల కొనసాగాలని. కొమరం భీం స్ఫూర్తితో రాబోయే కాలంలో జరిగే ప్రతి ఒక ఉద్యమాన్ని యువత కొనసాగించాలని. పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క సమస్య ఉద్యమంతోనే సహకారం అవుతుందని ఆదివాసి సంఘాలకు ఎప్పుడూ కూడా మా తోడ్పాటు ఉంటుందని అన్నారు. ఆదివాసి 9 తెగలు ఒక తాటి పై కొచ్చి ఉద్యమం చేస్తుందంటే దానికి మూలం గోండు బెబ్బులి కొమరం భీమ్ అని గుర్తు చేశారు. ఆదివాసులకి పదవులు రావడానికి కొమరం భీమ్ అని గుర్తు చేశారు. ఐదవ షెడ్యూల్ ఆరో షెడ్యూల్ 1/59,1/70 చట్టాలు పెస చట్టం ఆదివాసి రిజర్వేషన్లు ఆదివాసి హక్కులు అటవీ హక్కు చట్టాలు ఉన్నాయంటే దానికి మూలం స్వర్గస్తులైన కొమరం భీం దాదా అని అన్నారు. అదేవిధంగా మైదాన ప్రాంతంలో ఉన్న ఆదివాసులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు, అలాగే కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఆదివాసులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కోరారు. ఏజెన్సీలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు బీసీ రిజర్వేషన్లు అమలు చేయకూడదని అన్నారు. ఏజెన్సీలో ఆదివాసి హక్కులకై యువత ఉద్యమిం చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు షాకీ లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుంచు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గోవర్ధన్,రాజ్ గోండు సేవా సమితి జిల్లా ఉపాధ్యక్షులు నైతం భీమ్రావు, జేఏసీ కన్వీనర్ మంద మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకురి శ్రీనివాస్, బోర్ర భీమేష్ , అత్రం రాజు, రామకృష్ణ, శ్రీనివాస్, ఉయిక భీం రావ్. పేనుక వెంకటేష్. ధ్రువనాగ రావు. ఈశ్వర్, అత్రం అర్జున్ ,లింగాల శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో నాలుగు రోజులు పాటు వానలే వానలు!



– పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

తెలంగాణపై అల్పపీడన ప్రభావం

– నాలుగు రోజులు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు

– ఈ నెల 24,25 తేదీల్లో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు

**తెలంగాణసేన, హైదరాబాద్:** : అగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఇవాళ తీవ్ర అల్పపీడనంగా బలపడినట్లు హైదరాబాద్? వాతావరణ కేంద్రం తెలిపింది. అల్పపీడన ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారి ధర్మరాజు వెల్లడించారు. ఈ నెల 24, 25 తేదీల్లో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఆయన తెలిపారు. ఆ జిల్లాలకు భారీ వర్ష సూచన : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు పడుతున్నాయని వాతావరణశాఖ వెల్లడించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని తెలిపింది. రాగల 12 గంటల్లో ఇది మరింత బలపడి వాయిగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావం దక్షిణ తెలంగాణ జిల్లాల్లోని నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట్ జిల్లాలపై ఉంటుందని వివరించింది.

**తెలంగాణలో నాలుగు రోజులు పాటు వానలే వానలు! – పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**

ఆ రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం : ఇవాళ, రేపు దక్షిణ తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసినప్పటికీ 24 తేదీన ఉమ్మడి మహబూబ్‌నగర్, వికారాబాద్, సంగారెడ్డి ప్రాంతాల్లో భారీ వర్ష సూచన ఉండే అవకాశం ఉందని ఐఎండీ అధికారి ధర్మరాజు తెలిపారు. 24, 25 తేదీల్లో భారీ వర్షాలు కురిసే నేపథ్యంలో పలు జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికలు జారీ చేశామని అన్నారు. నైరుతి రుతుపవనాలు విరమణ సమయంలో ఈశాన్యగాలుల రాష్ట్రంలో ప్రవేశిస్తుంటాయని తెలిపారు. ఇవి పూర్తిస్థాయిలో విస్తరిస్తున్నాయని అన్నారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్?లో తుపానులు ఎక్కువగా ఏర్పడే అవకాశాలుంటాయని చెప్పారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడనంగా కొనసాగుతున్న ప్రాంతం గుర్తింపదగ్గ అల్పపీడనంగాను తరువాత రాగల 12 రోజుల్లో వాయుగుండంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయని అన్నారు.

రాష్ట్రంలో చలితీవ్రత పెరిగే అవకాశం : ప్రస్తుతం చలి తీవ్రత క్రమేపీ పెరుగుతోందని ఐఎండీ తెలిపింది. నవంబర్ రెండో వారం నుంచి చలి తీవ్రత గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది.

ప్రస్తుతం పొడిబారిన వాతావరణంతో పాటు ఎండతీవ్రత కూడా కొనసాగుతోందని చెప్పింది. స్థానికంగా ఏర్పడే క్యుములోనింబస్ మేఘం వల్ల మధ్యలో వర్షాలు కురుస్తున్నాయని వివరించింది. చలి తీవ్రత సాధారణంగా ఉత్తర తెలంగాణలో కనిపిస్తుందని ఐఎండీ అధికారి తెలిపారు. ఈ ఏడాది దక్షిణాది జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదవ్వడాన్ని పరిశీలించవచ్చని అన్నారు. చలి తీవ్రత కూడా ఉత్తర భాగంలోనే అధికంగా ఉంటుందని వివరించారు.



# రుద్రూర్‌లో పేకాట స్థావరాలపై పోలీసుల మెరుపుదాడులు - 33 మంది అరెస్ట్

**తెలంగాణసేన , రుద్రూర్ :** ఒకవైపు నిత్యం జూదంపై వస్తున్న వార్త కథనాలు. మరోవైపు దీపావళి పండుగ నేపథ్యంలో రుద్రూర్ మండలంలోని పలు గ్రామాల్లో పేకాట నిర్వహిస్తున్న స్థావరాలపై పోలీసులుఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మొత్తం 33 మందిని అదుపులోకి తీసుకున్నట్లు రుద్రూర్ ఎస్ఐ సాయన్న తెలిపారు. పోలీసులు చేపట్టిన దాడుల్లో ఆరు కేసులు నమోదు చేయగా, పేకాట రాయుళ్ల వద్ద ఉన్న నగదు రూ.27,000 స్వాధీనం చేసుకున్నారు. పేకాట నిర్వహణతో పాటు దానికి సహకరించిన వారిపైనా కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పేకాట ఆడిన అందుకు ఎవరైనా కృషి చేసిన కఠిన చర్యలు తప్పవని రుద్రూర్ ఎస్సై.సాయన్న హెచ్చరించారు

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో బీ,ఆర్,ఎస్ పార్టీకి భయపడుతున్న అధికార పార్టీ.

– గోపీనాథ్ కూతుర్ల ప్రచారాన్ని అడ్డుకున్న పోలీసులు..?

– అధికార బలముతో పోలీసుల దౌర్జన్యం ..?



**తెలంగాణ సేన న్యూస్:**జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో ఆశ్చర్యకరమైన ఘటన.బోరబండ డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ నేత మాగంటి గోపీనాథ్ కూతుర్లు (అక్షర,)( దిశిరల,) ప్రచారాన్ని పోలీసులు అడ్డుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం కేవలం 15 నుంచి 20 మందితో, ఎలాంటి శబ్ద యంత్రాలు లేకుండా, ప్రశాంతంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మాగంటి గోపీనాథ్ కుమార్తెలను పోలీసులు ఆపడం విచారకరం.ఇక పక్కనే కాంగ్రెస్ అభ్యర్థి వందలాది మంది కార్యకర్తలతో, మైకులు, బైక్ ర్యాలీలతో భారీగా ప్రచారం కొనసాగిస్తున్నా మాత్రం పోలీసులు కనీసం స్పందించకపోవడం ద్వంద్వ వైఖరిని బహిర్గతం చేస్తోంది.ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడిన అక్షర, దిశిరలను చూసి "ఆ చిన్నపిల్లలకు కూడా భయపడుతున్నారా?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.బీఆర్ఎస్ కార్యకర్తలు ఈ వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఎన్నికల కమిషన్ తక్షణమే జోక్యం చేసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన పెద్ద శ్రీశైలం యాదవ్ కుమారుడు గౌతమ్ యాదవ్..?



**తెలంగాణ సేన న్యూస్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పెద్ద శ్రీశైలం యాదవ్ కుమారుడు గౌతమ్ యాదవ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ మినిస్టర్ శ్రీ కేటీఆర్ సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకున్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "యువతలో రాజకీయ చైతన్యం పెరుగుతుండటం సంతోషకరం. గౌతమ్ యాదవ్ వంటి చైతన్యవంతుల చేరిక పార్టీకి కొత్త ఊపునిస్తుంది," అని అన్నారు. గౌతమ్ యాదవ్ మాట్లాడుతూ, "రాష్ట్ర అభివృద్ధి దిశగా కేటీఆర్ మార్గదర్శకత్వంలో ప్రజాసేవ చేయడం నా ధ్యేయం,"అని అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థి దశలోనే పోలీస్ వ్యవస్థ పై ఆవగాహన అవసరం

ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్



**ముధోల్:22అక్టోబర్.(తెలంగాణ సేన న్యూస్):** విద్యార్థి దశనుండే పోలీస్ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని ముధోల్ ఎస్సై బిట్ల పెర్సీస్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ముధోల్ లోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లా పోలీస్.. మీ పోలీసులు అందిస్తున్న సేవలపైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణగా చదువుకోవాలని అన్నారు. సమాజంలో పోలీసులు అందిస్తుంది సేవలు గురించి వివరించారు. మహిళల రక్షణకు ప్రత్యేకంగా షీ టీం ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు పోలీస్ వ్యవస్థ, పనితీరు పై వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది .ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దిలాల్పూర్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద గిరి ప్రదక్షణ



**తెలంగాణసేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం దిలాల్పూర్ గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం లో బుధవారం స్వాతి నక్షత్రం పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గిరి ప్రదక్షణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు కార్తీక మాసం మొదటిరోజు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి గిరిప్రదక్షిణ 41 వ నెల భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరిగిందని ప్రతి నెల భక్తులు భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ చేస్తున్నారని గిరి ప్రదక్షిణ వల్ల సిరిసంపదలు అష్టైశ్వర్యాలు చేకూరుతాయని, అనారోగ్య సమస్యలు దరి చేరవని, స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసమని ప్రతి ఒక్కరు దైవ భక్తి కలిగి ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో పురోహితులు నర్సింలు శర్మ, నరేష్ శర్మ బన్నీ శర్మ, నాయకులు సంతోష్ రెడ్డి, రాజేశం గుప్తా బాలేశం గుప్తా, భద్రయ్య గుప్తా,ముత్యం రెడ్డి రాజు రెడ్డి నరసింహారెడ్డి కొండల్ రెడ్డి, సోమేశ్వర్ రెడ్డి, రమేష్ రెడ్డి, లచ్చి రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, బాల గౌడ్,చిన్నారులు,మహిళలు, గ్రామస్థులు పెద్ద ఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు

# శివనామస్మరణతో మారుమోగిన బాసర

బాసర ఆలయంలో భక్తుల సందడి



**తెలంగాణ సేన అక్టోబర్ 22( బాసర ప్రతినిధి) :** నిర్మల్ జిల్లా బాసర పరమశివుడికి అత్యంత ప్రీతికరమైన మాసం కార్తీక మాసం ప్రారంభం కావడంతో బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది.ప్రతి సంవత్సరం దీపావళి ముగిసిన మరుసటి రోజు బుధవారం కార్తీక మాసం ప్రారంభం కావడంతో ఈ కార్తీక మాసంలో పవిత్ర గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు చేసి నది తీరాన ఉన్న శ్రీ సూర్యేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దీంతో భక్తులంతా శివనామస్మరణలో ఆలయం మారుమోగుతోంది.తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అమ్మవారి పాదాల వద్ద అక్షరాభ్యాస పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ అంజనీదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY



# ప్రైవేట్ ఉపగ్రహ ప్రయోగాల అభివృద్ధి

### పరిశ్రమలకు కీలకంగా ఆ 2 జిల్లాలు

### రాష్ట్రంలోనే కీలకంగా చిత్తూరు, తిరుపతి జిల్లాలు

### ప్రత్యేక రంగాలపై దృష్టి పెట్టి రాష్ట్రానికి సంపద, ఉద్యోగాలను పెంచేలా ప్రణాలిక



చిత్తూరు జిల్లా గంగవరం మండలంలో ఈ క్లస్టర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి ప్రణాళికలలో కీలకమైన భాగం. సిల్క్, గార్మెంట్స్ వంటి ప్రత్యేక రంగాలపై దృష్టి పెట్టడం ద్వారా రాష్ట్రానికి సంపద, ఉద్యోగాలను పెంచేలా చేస్తున్నారు. సుమారు 100 ఎకరాల్లో ఏపీఐఐసీ దీనిని అభివృద్ధి చేసింది. సిల్క్ (రేష్మీ), గార్మెంట్స్ తయారీ పరిశ్రమలు ఉన్నాయి.

**ప్రాధాన్యం :** జాతీయ రహదారి-16, వెదురుపట్టు క్రాస్‌రోడ్ వద్ద ఉంది. చెన్నై, బెంగుళూరు, తిరుపతి నగరాలకు కనెక్టివిటీ.

**లక్ష్యం :** సిల్క్, గార్మెంట్స్ రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణ, ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహం, జౌళీ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాల కల్పన, సిల్క్, గార్మెంట్స్ తయారీకి ప్రత్యేకమైన జోన్ ఏర్పాటు. ఆక్వారెల్, విశ్వ అపెరెల్స్, కోమల టెక్స్‌టైల్స్ లాంటి పరిశ్రమలు కొనసాగుతున్నాయి. అలానే స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తున్నాయి.

**తిరుపతి పెలికాన్ వ్యాలీ ఐటీ పార్క్ :** అమెరికాకు చెందిన ఎన్ఆర్ఐల బృందం తిరుపతి సమీపంలో టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్ ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. సుమారు 20 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. తొలిదశలో ఐటీ భవనాలు, వాణిజ్య కాంప్లెక్స్ నిర్మించనున్నారు. భవిష్యత్తులో ఇంక్యుబేషన్ కేంద్రాలు, పరిశోధన, అభివృద్ధి సౌకర్యాలు, ఉత్పత్తి, సేవా ఆధారిత ఐటీ కంపెనీలు వస్తాయి. అయితే ఈ ప్రాజెక్ట్ ప్రారంభ దశలోనే ఉంది.

**ప్రైవేట్ ఉపగ్రహాల తయారీ :** తిరుపతికి సమీపంలో స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థను హైదరాబాద్‌కు చెందిన ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు ఏర్పాటు చేశారు. ప్రైవేట్ ఉపగ్రహ ప్రయోగాలు, తక్కువ ధరలో చిన్న ప్రయోగ వాహనాలను అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యం. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ఇక్కడికి సమీపంలో ఉండటం అనుకూలమైన విషయం. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుంది.

**సౌకర్యాలు :** ఐఐటీ తిరుపతి, ఇస్రో శ్రీహరికోట, శ్రీసిటీ సెజ్‌లకు సమీపంలో ఉంది. టెక్ కంపెనీలు, స్టార్టప్స్‌కు ప్రాధాన్యం.దీ

బీఎన్ కండ్రిగ పారిశ్రామిక పార్కు: శ్రీకాళహస్తి నోడ్ ఇండస్ట్రియల్ పార్క్‌గా తొట్టంబేడు, బీఎన్ కండ్రిగ మండలాల్లో సుమారు 2,770 ఎకరాల్లో ఏపీఐఐసీ అభివృద్ధి చేస్తోంది. ఎలక్ట్రానిక్స్, ఇంజనీరింగ్, ఆటోమొబైల్ పరిశ్రమలు, ఫుడ్, అగ్రో ప్రాసెసింగ్, గార్మెంట్స్, టెక్స్‌టైల్ తయారీ, బిల్డింగ్ మెటీరియల్స్, నాన్-మెటాలిక్ మినరల్స్, కెమికల్, ఫార్మాస్యూటికల్, లెదర్, ప్లాస్టిక్, ఉడ్ వంటి చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, లాజిస్టిక్స్, గోదాములు ఏర్పాటు అవుతాయి.

**భవిష్యత్తు అభివృద్ధి:** రాష్ట్ర ప్రభుత్వం జౌళీ రంగంలో రూ.10,000 కోట్ల పెట్టుబడుల ఆకర్షణకు చర్యలు తీసుకుంటోంది. ఇది క్లస్టర్‌లో మరిన్ని పరిశ్రమల స్థాపనతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు సంతానం నిబంధనకు చెక్?!

### త్వరలోనే ఆర్డినెన్స్

### ఇద్దరు మించి సంతానం ఉన్న వారు పోటీ చేయరాదన్న నిబంధన తొలగింపునకు కసరత్తు

### కేబినెట్‌లో తుది నిర్ణయం తీసుకొని ఆర్డినెన్స్ జారీకి అడుగులు

### రానున్న ఎన్నికల్లోనే అమలుకు అవకాశం




స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉంటే పోటీ చేయరాదన్న నిబంధన తొలగింపు ప్రక్రియ వేగంగా సాగుతోంది. గురువారం కేబినెట్‌లో తుది నిర్ణయం తీసుకొని ఆర్డినెన్స్ జారీ చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. చట్టసవరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోద ముద్ర వేస్తే రానున్న పంచాయతీ ఎన్నికల్లోనే ఈ నిబంధన అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

**వారికి మార్గం సుగమం :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరికి మించి సంతానం ఉన్న వారు కూడా పోటీ చేసేందుకు మార్గం సుగమం కానుంది. పంచాయతీరాజ్, పురపాలక చట్టాల సవరణపై గురువారం జరిగే కేబినెట్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇద్దరు పిల్లల నిబంధన తొలగించాలని? ఈనెల 16న నిర్ణయం తీసుకున్న? మంత్రివర్గం చట్టసవరణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారుల్ని ఆదేశించింది. ఈమేరకు పంచాయతీరాజ్, పురపాలక శాఖలు కేబినెట్ సమావేశంలో పెట్టేందుకు ప్రతిపాదనలు సమర్పించాయి. ఫైల్‌పై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంతకం చేశారు.

**ఆర్డినెన్స్ ద్వారా చట్టసవరణ చేయాలని :** ఈ ఫైల్‌పై ముఖ్యమంత్రి సంతకం చేస్తే ఈ గురువారం కేబినెట్ సమావేశంలో దీనిపై చర్చించి చట్టసవరణకు నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరగడం లేదు. ఈ కారణంగా ఆర్డినెన్స్ ద్వారా చట్టసవరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని కేబినెట్ ఆమోదించిన తర్వాత ముసాయిదా ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపించనున్నారు. గవర్నర్ ఆమోద ముద్ర వేస్తే రానున్న పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లోనే దీనిని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

**మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలి :** బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టేతో స్థానిక సంస్థల ఎన్నికలను ఎస్ఈసీ నిలిపివేసింది. కోర్టుల సూచనల మేరకు ఒకవేళ పాత రిజర్వేషన్ల ప్రకారం వెళ్లాలని ప్రభుత్వం భావిస్తే మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ అలా జరిగితే ఇద్దరు పిల్లల నిబంధన కూడా తొలగించే అవకాశం ఉంది. ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్నవారు స్థానిక సంస్థల్లో పోటీ చేయరాదన్న నిబంధన ?ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 30 ఏళ్లుగా అమల్లో ఉంది. కుటుంబ నియంత్రణను ప్రోత్సహించేందుకు 1995లో ఉమ్మడి రాష్ట్రంలో ఈ నిబంధనను ప్రవేశపెట్టారు.

**కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం :** గత సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌లో ఈ నిబంధన తొలగిస్తూ ?చట్ట సవరణ చేశారు. తెలంగాణలోనూ ఆ నిబంధనను ఎత్తివేయాలని ఈనెల 16న కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలో కుటుంబ నియంత్రణ, సంతానోత్పత్తి రేటు, ప్రజల నుంచి వస్తున్న వినతులు తదితర వివరాల ఆధారంగా పంచాయతీరాజ్, పురపాలక శాఖలు ప్రభుత్వానికి నివేదిక సమర్పించాయి. గురువారం కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

# ఆరేళ్ల ప్రేమ.. నెల రోజుల పెళ్లి,చివరకు మిగిలింది శోకమే


### జగిత్యాలలో ప్రేమ వివాహం చేసుకున్న జంట ఆత్మహత్య

### కూరలో కారం ఎక్కువైందని భర్త మందలించడంతో భార్య బలవన్మరణం

### దసరా రోజు భార్య ప్రాణాలు తీసుకోగా, దీపావళికి భర్త ఆత్మహత్య

### భార్య మరణానికి తానే కారణమని భర్త తీవ్ర మనోవేదన

### పెళ్లయిన నెల రోజులకే నవ దంపతుల మృతితో గ్రామంలో విషాదం



ఆరేళ్ల పాటు ప్రేమించుకున్నారు.. పెద్దలను ఎదిరించి ఒక్కటయ్యారు. కానీ వారి వివాహ జీవితం నెల రోజులు కూడా నిలవలేదు. ఒక చిన్న గొడవ ఆ నవ దంపతుల జీవితాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. దసరా పండుగ నాడు భార్య ఆత్మహత్య చేసుకోగా, భార్య మరణానికి తానే కారణమని తీవ్ర మనస్తాపంతో దీపావళి రోజు భర్త కూడా ప్రాణాలు తీసుకున్నాడు. ఈ హృదయ విదారక ఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో చోటుచేసుకుంది.

**అసలేం జరిగిందంటే..!**

ఎర్దండి గ్రామంలోని వడ్డెర కాలనీకి చెందిన సంతోష్, గంగోత్రి ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరి ఇళ్లు ఎదురెదురుగానే ఉండటంతో వారి మధ్య ప్రేమ చిగురించింది. కుటుంబ సభ్యులను ఒప్పించి సెప్టెంబర్ 26న ఘనంగా వివాహం చేసుకున్నారు. అయితే, దసరా పండుగ సందర్భంగా ఈ నెల 2న ఈ జంట గంగోత్రి పుట్టింటికి వెళ్లారు. అక్కడ భోజనం చేసే సమయంలో మాంసం కూరలో కారం ఎక్కువగా ఉందని సంతోష్ భార్యను మందలించాడు.అందరి ముందు భర్త తిట్టడంతో తీవ్రంగా నొచ్చుకున్న గంగోత్రి, అదే రోజు రాత్రి అత్తారింటికి తిరిగి వచ్చాక ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య తన వల్లే చనిపోయిందని సంతోష్ తీవ్ర వేదనకు గురయ్యాడు. అప్పటి నుంచి కుమిలిపోతూ, మానసికంగా కృంగిపోయాడు.ఈ క్రమంలో దీపావళి పండుగ కోసం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉంటున్న తన అక్క ఇంటికి వెళ్లాడు. అక్కడ మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి అతను కూడా ఉరివేసుకుని ప్రాణాలు విడిచాడు. ఇలా పండుగల నాడు భార్యాభర్తలిద్దరూ నెల రోజుల వ్యవధిలో బలవన్మరణానికి పాల్పడటంతో ఇరు కుటుంబాలతో పాటు ఎర్దండి గ్రామంలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్నపాటి క్షణికావేశం రెండు నిండు ప్రాణాలను బలిగొనడం స్థానికులను కలచివేసింది.

# కూరుకుపోయిన హెలికాప్టర్ ద్రౌపది ముర్ముకు తప్పిన ప్రమాదం

### కేరళ పర్యటనలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ప్రమాదం

### కొచ్చి స్టేడియంలో బురదలో కూరుకుపోయిన హెలికాప్టర్

### నాలుగు రోజుల పర్యటనలో భాగంగా జరిగిన ఘటన

### అతి కష్టం మీద పక్కకు నెట్టిన భద్రతా సిబ్బంది

### శబరిమల దర్శనానికి వెళ్తుండగా ఘటన



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కేరళ పర్యటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఆమె ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ల్యాండింగ్ సమయంలో బురదలో కూరుకుపోవడంతో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అయితే, భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తేవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.వివరాల్లోకి వెళితే, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నాలుగు రోజుల పర్యటన నిమిత్తం కేరళలో ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా ఇవాళ ఆమె శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకోవాల్సి ఉంది. ఇందుకోసం కొచ్చిలోని ప్రమదం స్టేడియానికి హెలికాప్టర్‌లో చేరుకున్నారు. అయితే, హెలికాప్టర్ ల్యాండ్ అయిన సమయంలో దాని టైర్లు ఒకవైపు బురదలో పూర్తిగా దిగబడిపోయాయి.దీంతో అక్కడ ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో హెలికాప్టర్‌ను అతి కష్టం మీద బురద నుంచి బయటకు నెట్టి సురక్షిత ప్రదేశానికి చేర్చారు. ఈ అనూహ్య ఘటనతో షెడ్యూల్ కొద్దిసేపు నిలిచిపోయింది. అనంతరం, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అక్కడి నుంచి శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి బయలుదేరి వెళ్లారు. ఈ ఘటనతో అధికారులు భద్రతా ఏర్పాట్లపై సమీక్ష చేపట్టారు.

# లక్ష్మీనాయుడు కుటుంబానికి పరిహారం ప్రకటించిన చంద్రబాబు



నెల్లూరు జిల్లా గూడ్లూరు మండలం దరకనిపాడుకు చెందిన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు హత్యపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. లక్ష్మీనాయుడు హత్య అమానవీయం, అమానుషమని విమర్శించారు.ెల్లూరు జిల్లా గూడ్లూరు మండలం దరకనిపాడుకు చెందిన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు హత్యపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. లక్ష్మీనాయుడు హత్య అమానవీయం, అమానుషమని విమర్శించారు. ఈ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు.రాష్ట్రంలోని శాంతి భద్రతలపై సచివాలయంలో మంగళవారం నాడు చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. హోం మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, కందుకూరు ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. లక్ష్మీనాయుడు హత్య కేసు నిందితులకు కఠిన శిక్ష పడాలన్నారు. ప్రత్యేక ట్రైబ్యునల్ ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు.లక్ష్మీ నాయుడు కుటుంబానికి ప్రభుత్వం తరఫున పరిహారం ప్రకటించారు. లక్ష్మీనాయుడి భార్యకు రెండెకరాల భూమితో పాటు రూ.5 లక్షల నగదు, ఇద్దరు పిల్లలకు రెండెకరాల చొప్పున భూమితో పాటు రూ.5 లక్షల చొప్పున నగదు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. లక్ష్మీనాయుడి పిల్లల్ని చదివించే బాధ్యత తమ ప్రభుత్వమే తీసుకుంటుందని తెలిపారు. ఇక కారు దాడిలో గాయపడిన పవన్‌కు నాలుగెకరాలు, రూ.5లక్షల నగదును, భార్గవ్‌కు రూ.3లక్షల పరిహారం అందజేస్తామని ప్రకటించారు. ఇక లక్ష్మీనాయుడు హత్య కేసు విచారణ వేగంగా జరిగేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు అప్పగించారు. కేసు విచారణ కోసం ప్రత్యేక పీపీని నియమించాలని ఆదేశించారు.

# రైతన్న కష్టం.. వర్షార్పణం రైతన్న



రెక్కల కష్టం.. వర్షం కారణంగా వృథా అవుతున్నది. సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దయింది. కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో మార్కెట్ యార్డుల్లో తడిసిన ధాన్యంఇల్లంతకుంట/గన్నేరువరం/ఇచ్చోడ/ఇంద్రవెల్లి/నార్నూర్, రైతన్న రెక్కల కష్టం.. వర్షం కారణంగా వృథా అవుతున్నది. సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దయింది.రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట, ముస్తా బాద్, చందుర్తి, కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలాల్లో వర్షం కురవడంతో రైతులు ధాన్యాన్ని కాపాడుకోలేక పోయారు. ఆదిలా బాద్ జిల్లా సిరికొండలోని వ్యవసాయ భూము ల్లో ఆరబోసిన మక్క, జొన్న, సోయా, ఇంద్రవె ల్లిలో మక్కజొన్న, నార్నూర్‌లో మక్క, సో యా, పెసర పంటలు తడిసిపోయాయి.

# ప్రమోద్ కుటుంబానికి కోటి పరిహారం



రౌడీషీటర్ రియాజ్ చేతిలో హత్యకు గురైన కానిస్టేబుల్ ప్రమోద్‌కుమార్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, 300 గజాల ఇంటి స్థలంబాధిత కుటుంబానికి డీజీపీ శివధర్‌రెడ్డి పరామర్శ రౌడీషీటర్ రియాజ్ చేతిలో హత్యకు గురైన కానిస్టేబుల్ ప్రమోద్‌కుమార్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ వెళ్లిన డీజీపీ%ౌ% ప్రమోద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పోలీస్ కమిషనరేట్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రమోద్ కుటుంబానికి కోటి రూపాయ ల పరిహారం, సెప్టెంబర్‌లో ప్రమోద్‌కు వచ్చినంత మొత్తం లో జీతం.. ఆయన రిటైర్మెంట్ వయసు వరకు కుటుంబానికి అందుతుందని తెలిపారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 300 గజాల ఇంటి స్థలం, పోలీస్ భద్రత సంక్షేమం నుంచి రూ.16 లక్షలు, పోలీస్ వెల్ఫేర్ నుంచి రూ.8 లక్షల పరిహారం చెల్లిస్తామని పేర్కొన్నా రు.రియాజ్‌ను ప ట్టుకునేందుకు ఆసిఫ్ అనే వ్యక్తి అందించిన సహకారం మరువలేనిదని అభినందించారు. ఆసిఫ్ భార్యకు రూ.50 వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా రియాజ్ ఎన్‌కౌంటర్‌పై స్పందించేందుకు డీజీపీ నిరాకరించారు. మానవ హక్కుల కమిషన్ సమోటో కేసు విచారణ దశలో ఉన్నందున మాట్లాడలేమని చెప్పారు. ఎన్‌కౌంటర్ జరిగిన రోజు సాయంత్రమే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ విచారణ చేశారని తెలిపారు. తెలంగాణలో తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న నేరస్థులను కఠినంగా అణచివేస్తామని మరో ప్రకటనలో స్పష్టంచేశారు. రియాజ్ చేతిలో దారుణ హత్యకు గురైన కానిస్టేబుల్ ప్రమోద్‌కు పోలీసుశాఖ తరుపున నివాళులు అర్పించారు. తెలంగాణలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసుశాఖ నిబద్ధతతో ఉన్నదని పేర్కొన్నారు.

# సచివాలయమా ధర్నాచౌకా?



రాష్ట్ర పరిపాలనా కేంద్రంగా ఉండాల్సిన సచివాలయం.. కాంగ్రెస్ పాలనలో ధర్నాచౌక్‌లా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పెండింగ్ బిల్లుల కోసం సచివాలయంలో కాంట్రాక్టర్ల ధర్నాంవంత్‌రెడ్డి దుర్మార్గ, అసమర్థ పాలనకు ఇదే నిదర్శనంమాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్‌రాష్ట్ర పరిపాలనా కేంద్రంగా ఉండాల్సిన సచివాలయం.. కాంగ్రెస్ పాలనలో ధర్నాచౌక్‌లా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ రెండు రోజుల క్రితం చిన్న కాంట్రాక్టర్లు సచివాలయం లోపల ధర్నా చేయగా, తాజాగా ప్రభుత్వ అద్దె వాహన యజమానులు సచివాలయం ఎదుట ఆందోళన చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గ, అసమర్థ పాలనకు ఇది నిలువెత్తు నిదర్శనం కాదా? అని మంగళవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.కమీషన్ల కోసం బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, చిన్న కాంట్రాక్టర్లు, చిరు ఉద్యోగులకు చెల్లించాల్సిన బిల్లులతోపాటు జీతాలను కూడా పెండింగ్ పెట్టడం శోచనీయమమని పేర్కొన్నారు. వాహనాల అద్దె బిల్లులు హైదరాబాద్‌లో 10 నెలలుగా, జిల్లాలో రెండేండ్లుగా పెండింగ్‌లో పెట్టడం తీవ్ర అన్యాయం అని మండిపడ్డారు. కమీషన్లు ఇవ్వడంలేదనే అద్దె వాహనాల బిల్లులు చెల్లించడం లేదా? అని నిలదీశారు. అద్దె వాహన యజమానుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## తులసి దళాలు నమలవద్దు అనే ఆధ్యాత్మిక నమ్మకం వెనుక సైంటిఫిక్ రీజన్ ఏమిటంటే



తులసి అధ్యాత్మికంగానే కాదు ఆయుర్వేదంలో కూడా ప్రముఖ స్థానం ఉంది. తులసిలో అనేక ఔషధ గుణాలున్నాయి. దీంతో చాలా మంది ఉదయం ఖాళీ కడుపుతో తులసి ఆకులను నములుతారు. అయితే ఇలా చేయడం తప్పు. దంతాలు తులసి ఆకును తాకకూడదు. ఎందుకంటే ఇది చెడు రసాలను ఉత్పత్తి చేస్తుంది. ఇది శరీరంపై చాలా ప్రభావం చూపుతుంది. అందుకే తులసి నమలడానికి బదులుగా.. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం తులసిని ఎలా ఉపయోగించాలో తెలుసుకుందాం.. తులసి అన్ని వ్యాధులకు మందు. ఇది శారీరకంగా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. ఆధ్యాత్మికంగానే కాదు.. సైన్స్ దృక్కోణంలో కూడా తులసి మంచిది. తులసి పూజ వల్ల ఇంట్లో శాంతి, ఆనందం నెలకొంటాయి. అంతేకాదు తులసి ఆకులు ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. పిల్లలకు జలుబు, జ్వరం వచ్చినప్పుడు తులసి ఆకులను కషాయం రూపంలో ఇస్తారు. ఇది ఆరోగ్యానికి మంచిది. అందువల్ల తులసి ఆకులను ఉదయం ఖాళీ కడుపుతో తింటారు. అయితే ఈ అలవాటు వాస్తవంగా ఆరోగ్యానికి హానికరమని చెబుతున్నారు. వాస్తవంగా తులసి దళాలు ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తాయి. వీటిని నేరుగా దంతాలతో నమలడం మాత్రం మంచిది కాదు. తులసిని నమిలి తింటే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని చెబుతున్నారు. ఈ రోజు తులసి ఆకులను నేరుగా ఎందుకు నమల కూడదు? ఆరోగ్యం కోసం తులసి ఆకులను ఎలా తీసుకోవాలి తెలుసుకుందాం.. తులసి ఆకులను ఎందుకు నమలకూడదు? తులసి ఆకులు పాదరసం వంటి అంశాలను కలిగి ఉన్నాయి. కనుక వీటిని నోట్లో వేసుకుని నేరుగా దంతాలతో నమలడం నోటి ఆరోగ్యానికి హానికరం. ప్రతిరోజూ తులసిని నమలడం ప్రారంభించినప్పుడు.. ఈ అలవాటు నెమ్మదిగా దంతాల ఎనామిల్‌ను దెబ్బతీయడం ప్రారంభిస్తుంది. క్రమంగా దంతాలు సున్నితంగా మారుతాయి. దంతాలు బలహీనం అవుతాయి. అలాగే తులసి ఆకుల తేలికపాటి ఘాటు నోటిలో చికాకు, పుండ్లను కలిగిస్తుంది. తులసి ఆకులను ఎలా తీసుకోవాలంటే తులసి ఆకులను నమలడానికి బదులుగా.. తులసి ఆకులతో కషాయాలను లేదా తులసి ఆకుల సారాన్ని త్రాగాలి. తులసి ఆకులను నీటి నానబెట్టి తేనె కలిపి కూడా తినవచ్చు. ఇలా చేయడం వలన దంతాలకు హాని కలగదు. పైగా అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందుతారు. తులసి మొక్క హిందువులకు పవిత్రమైన మొక్క. కనుక తులసి దళాలను కోసేందుకు కూడా కొన్ని నియమలున్నాయి. ఎప్పుడు బడితే అప్పుడు ఎలా బడితే అలా తులసి వినియోగం అశుభకరమైనదిగా పరిగణించబడుతుంది. తులసిని నమలడం కంటే, తులసి ఆకులను నీటిలో వేసుకుని తాగడం మంచిది. తులసిని నేరుగా పళ్ళతో కొరికరాదు అని హిందువుల నమ్మకం.

## బలంతో కాదు బుద్ధితో కొట్టండి.. ఎవర్నైనా ఓడించే బ్రెయిన్ పవర్ సీక్రెట్.. ఇవి పెంచుకోండి..



తెలివితేటలు పుట్టుకతోనే వస్తాయని చాలామంది నమ్ముతారు. కానీ, అది నిజం కాదు! మీ రోజువారీ అలవాట్లు మెదడు పనితీరుపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. సరైన జీవనశైలి, నిరంతర అభ్యాసంతో ఎవరైనా తమ ఐక్యూ (తెలివితేటలు) పెంచుకోవచ్చు. తెలివితేటలే సమాజంలో మిమ్మల్ని ప్రత్యేకంగా నిలబెడుతుంటాయి. మీ మెదడును చురుకుగా మార్చి, తెలివిని పెంచే కొన్ని రహస్యాలు ఇక్కడ ఉన్నాయి. అవేంటో తెలుసుకుందామా? తెలివైన వారు పుట్టుకతోనే అలా ఉంటారని చాలామంది అనుకుంటారు. కానీ, అది నిజం కాదు. రోజువారీ అలవాట్లు మెదడు పనితీరును గణనీయంగా ప్రభావితం చేస్తాయి. నిరంతర అభ్యాసం, సరైన జీవనశైలితో ఎవరైనా తమ ఐక్యూను పెంచుకోవచ్చు. మీ మెదడును చురుకుగా మార్చి, తెలివిని పెంచే కొన్ని రహస్యాలు ఇక్కడ ఉన్నాయి:

**1. కొత్త విషయాలు నేర్చుకోండి:**

ప్రతిరోజు ఏదో ఒక కొత్త విషయం నేర్చుకోవాలి. అది కొత్త భాష కావచ్చు, సంగీత వాయిద్యం నేర్చుకోవడం కావచ్చు, లేదా ఒక పుస్తకం చదవడం కావచ్చు. నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవడం వల్ల మెదడులో కొత్త న్యూరల్ మార్గాలు ఏర్పడతాయి. ఇది మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది.

**2. తగినంత నిద్ర పొందండి:**

మెదడు ఆరోగ్యానికి నిద్ర చాలా ముఖ్యం. తగినంత నిద్ర లేకపోతే, మెదడు అలసిపోతుంది, ఏకాగ్రత తగ్గుతుంది. ప్రతిరోజు 7-8 గంటలు నిద్రపోవడం వల్ల మెదడుకు విశ్రాంతి దొరుకుతుంది, మరుసటి రోజు చురుకుగా పనిచేస్తుంది.

**3. క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి:**

శారీరక వ్యాయామం మెదడు ఆరోగ్యానికి కూడా చాలా ముఖ్యం. వ్యాయామం రక్త ప్రసరణను పెంచుతుంది. మెదడుకు ఆక్సిజన్, పోషకాలు సరిగా అందుతాయి. ఇది మెదడు కణాల పెరుగుదలకు, జ్ఞాపకశక్తి మెరుగుదలకు సాయపడుతుంది.

**4. పజిల్స్, మెదడు ఆటలు ఆడండి:**

సుడోకు, క్రాస్‌వర్డ్ పజిల్స్, చెస్ లాంటి మెదడు ఆటలు మెదడుకు వ్యాయామం. ఇవి సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని, విశ్లేషణాత్మక ఆలోచనను మెరుగుపరుస్తాయి.

**5. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి:**

మీ ఆహారంలో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ప్రోటీన్లు ఉండాలి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ (చేపలు, గింజలు), యాంటీఆక్సిడెంట్లు (బెర్రీలు, ఆకుపచ్చ కూరగాయలు) మెదడు ఆరోగ్యానికి చాలా మంచివి.

**6. ఒత్తిడిని తగ్గించుకోండి:**

దీర్ఘకాలిక ఒత్తిడి మెదడుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ధ్యానం, యోగా, శ్వాస వ్యాయామాలు వంటివి ఒత్తిడిని తగ్గించి, మెదడును ప్రశాంతంగా ఉంచడానికి సాయపడతాయి.

**7. సామాజికంగా కలవండి:**

స్నేహితులు, కుటుంబ సభ్యులతో సమయం గడపడం, సామాజిక కార్యక్రమాలలో పాల్గొనడం మెదడుకు ఉత్తేజాన్ని ఇస్తుంది. ఇతరులతో సంభాషించడం వల్ల కొత్త ఆలోచనలు, దృక్కోణాలు అలవడతాయి.

**8. కొత్త నైపుణ్యాలు నేర్చుకోండి:**

ఏదైనా కొత్త నైపుణ్యాన్ని నేర్చుకోవాలి. అది వంట కావచ్చు, పెయింటింగ్ కావచ్చు, లేదా ఒక కొత్త ప్రోగ్రామింగ్ భాష కావచ్చు. కొత్త నైపుణ్యాలు మెదడులోని వివిధ భాగాలను చురుకుగా చేస్తాయి. ఈ అలవాట్లను మీ దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా, మీరు మీ ఐక్యూను పెంచుకోవడమే కాకుండా, మెరుగైన మానసిక ఆరోగ్యంతో జీవించగలరు.

### మీకు ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయా?

# మూత్రపిండాల సమస్య కావచ్చు!

మూత్రపిండాలు దెబ్బతినడం వల్ల శరీరంలో చర్మ సమస్యలు కూడా కనిపిస్తాయి. చర్మం పొడిగా లేదా దురదగా మారవచ్చు. ఈ సమస్య ఉదయం పూట ఎక్కువగా అనిపించవచ్చు. ఎందుకంటే మూత్రపిండాలు శరీరంలోని ఖనిజాల సమతుల్యతను కాపాడుతాయి. ఉదయం నిద్ర లేవగానే.. మూత్రపిండాలు రక్తాన్ని శుద్ధి చేయడమే కాకుండా, అవసరమైన పోషకాల సమతుల్యతను కూడా కాపాడుతాయి. కానీ కొన్నిసార్లు శరీరంలోని ఈ ముఖ్యమైన అవయవం ఇబ్బంది పడుతూ ఉంటుంది. కానీ దాని నష్టం సంకేతాలను మనం అర్థం చేసుకోలేము. ఈ నిర్లక్ష్యం ప్రమాదకరం కావచ్చు. ఆ సంకేతాలు ఏమిటి? మన మూత్రపిండాల ఆరోగ్యం గురించి మనం అప్రమత్తంగా ఉండాలి.

**ముఖం మీద వాపు:**


ఉదయం నిద్ర లేచిన తర్వాత మీ కళ్ళ చుట్టూ, మీ ముఖం మీద వాపు కనిపిస్తే, అది మూత్రపిండాల దెబ్బతింటుందని హెచ్చరిక కావచ్చు. మూత్రపిండాలు శరీరంలో సోడియం, ద్రవం సమతుల్యతను నియంత్రిస్తాయి. అవి సరిగ్గా పనిచేయలేనప్పుడు కణజాలాలలో ద్రవం పేరుకుపోవడం ప్రారంభమవుతుంది. ఇది వాపుకు కారణమవుతుంది.

**మూత్రంలో నురుగు**

ఉదయం నిద్ర లేచిన తర్వాత మూత్రం నురుగుగా ఉంటే, అది మూత్రపిండాలు దెబ్బతిన్నాయనడానికి సంకేతం కావచ్చు. శరీరంలో అవసరమైన ప్రోటీన్లను నిర్వహిస్తూనే మూత్రపిండాలు వ్యర్థాలను తొలగిస్తాయి. కానీ మూత్రపిండాలు సరిగ్గా పనిచేయలేనప్పుడు ప్రోటీన్ లీక్ కావడం ప్రారంభమవుతుంది. ఇది ఈ సమస్యకు దారితీస్తుంది.

**ఉదయం అలసిపోయినట్లు అనిపిస్తుంది**

ఉదయం నిద్ర లేచిన తర్వాత శరీరం అలసిపోయినట్లు అనిపిస్తే, అది మూత్రపిండాలు దెబ్బతింటున్నాయనే హెచ్చరిక కావచ్చు. మూత్రపిండాలు శరీరం నుండి విషాన్ని తొలగిస్తాయి. కానీ మూత్రపిండాలు సరిగ్గా పనిచేయనప్పుడు ఈ విషపదార్థాలు రక్తంలో పేరుకుపోవడం ప్రారంభిస్తాయి. దీని కారణంగా అలసట, ఏకాగ్రత



పెట్టడంలో ఇబ్బంది మొదలైనవి అనుభూతి చెందుతాయి.

**చర్మం పొడిబారడం, దురద**

మూత్రపిండాలు దెబ్బతినడం వల్ల శరీరంలో చర్మ సమస్యలు కూడా కనిపిస్తాయి. చర్మం పొడిగా లేదా దురదగా మారవచ్చు. ఈ సమస్య ఉదయం పూట ఎక్కువగా అనిపించవచ్చు. ఎందుకంటే మూత్రపిండాలు శరీరంలోని ఖనిజాల సమతుల్యతను కాపాడుతాయి. మురికిని తొలగిస్తాయి. కానీ మూత్రపిండాల పనితీరు దెబ్బతినడం వల్ల శరీరంలోని ఈ రెండు మూలకాల సమతుల్యత చెదిరిపోతుంది.

**దుర్వాసనజి**

ఉదయం నిద్ర లేవగానే దుర్వాసన రావడం కూడా మూత్రపిండాల సమస్యను సూచిస్తుంది. మూత్రపిండాల పనితీరు సరిగా లేకపోవడం వల్ల, రక్తంలో టాక్సిన్స్ పేరుకుపోవడం ప్రారంభమవుతుంది. ఇది దుర్వాసనకు దారితీస్తుంది. ఈ పరిస్థితిని యురేమిక్ ఫ్యాట్ అంటారు.

**మూత్రంలో రక్తం**

మూత్రంలో రక్తం చూసి ప్రజలు తరచుగా భయపడతారు. కానీ ఇది మూత్ర నాళాల ఇన్ఫెక్షన్ లేదా మూత్రపిండాల రాళ్ల వల్ల సంభవించవచ్చు. అయితే, నొప్పి లేకుండా మూత్రంలో రక్తస్రావం అనేది మూత్రపిండ కణ క్యాన్సర్ లేదా మూత్రాశయ క్యాన్సర్ అనే ప్రాణాంతక వ్యాధికి సంకేతం కావచ్చు.

**ఆకలి లేకపోవడం, అలసట**

ఆకలి లేకపోవడం, అలసట సాధారణ లక్షణాలు. కానీ రోగి మూత్రపిండాల వ్యాధి ముదిరిన దశలో ఉన్నప్పుడు ఈ లక్షణాలు కనిపించవచ్చు. ఇది రక్తహీనత పరిస్థితి కారణంగా జరుగుతుంది.

### గుమ్మడి విత్తనాలు ఆరోగ్యానికి మంచివే..

# కానీ వీరికి మాత్రం విషంతో సమానం! బీకేర్ ఫుల్..



గుమ్మడి గింజలను క్రమం తప్పకుండా ఆహారంలో తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఈ విత్తనాలలో విటమిన్ ఎ, ఫైబర్, ఐరన్, కాల్షియం, బి2, ఫోలేట్, బీటా-కెరోటిన్, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. కాబట్టి వీటిని క్రమం.. గుమ్మడికాయ గింజలు ఆరోగ్య ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిని క్రమం తప్పకుండా ఆహారంలో తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఈ విత్తనాలలో విటమిన్ ఎ, ఫైబర్, ఐరన్, కాల్షియం, బి2, ఫోలేట్, బీటా-కెరోటిన్, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. కాబట్టి వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం ఆరోగ్యానిక మంచిది. కానీ మంచిదికదాని అతిగా తీసుకుంటే అమృతం కూడా విషంగా మారుతుందని మీరు వినే ఉంటారు. ఈ విషయంలో గుమ్మడికాయ గింజలకు ఎలాంటి మినహాయింపులేదు. వీటిని ఎక్కువగా తినడం వల్ల తీవ్రమైన దుష్ప్రభావాలు వస్తాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం..


**గుమ్మడి గింజల దుష్ప్రభావాలు ఇవే..**

ఆరోగ్యానికి మంచి చేసే గుమ్మడి గింజల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల వాటిని అధికంగా తినడం వల్ల కడుపు నొప్పి, విరేచనాలు సంభవిస్తాయని నిపుణులు అంటున్నారు. గుమ్మడి గింజలను అధికంగా తీసుకోవడం వల్ల కొంతమంది బరువు పెరిగే అవకాశం ఉంది. గుమ్మడి గింజలు తినడం వల్ల కొంతమందిలో అలెర్జీలు రావచ్చు. గుమ్మడి గింజల అలెర్జీ ఉంటే, వాటిని తీసుకోవడం తగ్గించడం మంచిది. ఈ విత్తనాలను అధికంగా తీసుకోవడం వల్ల తీవ్రమైన గొంతు నొప్పి, దగ్గు వస్తుంది. గుమ్మడికాయ గింజలను తరచుగా తీసుకోవడం వల్ల కొంతమందిలో రక్తపోటు తగ్గుతుంది. కాబట్టి ఇప్పటికే తక్కువ రక్తపోటుతో బాధపడుతున్నవారు వీటిని తినకపోవడమే మంచిది. గుమ్మడి గింజలను చిన్న పిల్లలకు ఇవ్వకూడదు. ఎందుకంటే ఈ విత్తనాలు పిల్లల గొంతులో చిక్కుకునే అవకాశం ఉంది. పెద్దలు కూడా దీన్ని సరిగ్గా నమిలి, తిని మింగాలి. గుమ్మడికాయ గింజలను సరిగ్గా తీసుకుంటేనే వాటి పూర్తి ప్రయోజనాలు లభిస్తాయని నిపుణులు అంటున్నారు. వీటిని అధికంగా తీసుకోవడం వల్ల మంచి కంటే కీడే ఎక్కువ జరుగుతుంది. కాబట్టి వీటిని తీసుకోవడంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. సలాడ్లు, గ్రానోలా బార్లు, స్మూతీస్ వంటి ఆహారాల్లో గుమ్మడికాయ గింజలను తీసుకోవచ్చు. వీటిని తేలికగా వేయించి కూడా తీసుకోవచ్చు. ఈ కంటెంట్ సాధారణ సమాచారం మాత్రమే అందిస్తుంది. మరింత సమాచారం కోసం వైద్యుడిని సంప్రదించడం మర్చిపోవద్దు.

### వెన్ను, నడుము నొప్పితో ఇబ్బంది పడుతున్నారా..

# రిలీఫ్ కోసం ఈ యోగాసనాలు ట్రై చేయండి

చాలా సార్లు బరువైన వస్తువులను ఎత్తడం లేదా కూర్చునే విధానంలో మార్పు వలన వెన్నునొప్పి సమస్య వస్తుంది. వాస్తవంగా చెప్పాలంటే ఈ రోజుల్లో ఈ సమస్య చాలా సర్వ సాధారణం అయిపోయింది. దీని కారణంగా ప్రజలు తమ రోజువారీ పనులు చేసుకోవడంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనుక వెన్నునొప్పి సమస్య నుంచి ఉపశమనం కోసం మీరు ఏ యోగాసనాలను ప్రయత్నించవచ్చో ఈ రోజు తెలుసుకుందాం.. రోజంతా ఆఫీసులో డెస్క్ దగ్గర కూర్చుని పని చేసే వ్యక్తులు తరచుగా వెన్నునొప్పితో బాధపడుతుంటారు. ఎందుకంటే రోజంతా కూర్చొని పని చేయడం వల్ల శరీరం కదలదు.. పైగా కూర్చునే భంగిమలో తేడా ఉండడం వలన వెన్నునొప్పి మొదలవుతుంది. కొన్నిసార్లు దీనికి కారణం బరువైన వస్తువులను ఎత్తడం కూడా కావచ్చు. అటువంటి పరిస్థితిలో యోగా సహాయం తీసుకోవడం వలన మంచి రిలీజ్ లభిస్తుంది. కొన్ని యోగాసనాలు మీ కండరాలను సడలించి నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా వెన్నెముక కూడా బలపడుతుంది. ఇది వెన్నునొప్పి నుంచి ఉపశమనం ఇస్తుంది. యోగా రక్త ప్రసరణను మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. వెన్నునొప్పి నుంచి ఉపశమనం కలిగించే కొన్ని యోగాసనాల గురించి ఈ రోజు తెలుసుకుందాం.. భుజంగాసనం భుజంగాసనం చేయడానికి.. మీ పొట్టపై పడుకుని, మీ చేతులను మీ భుజాల దగ్గర ఉంచి, మీ శరీరాన్ని పైకి ఎత్తండి. ఈ యోగాసనాన్ని చేయడం వల్ల కండరాలు బలపడతాయి. వెన్నునొప్పి కూడా ఉపశమనం పొందుతుంది. ఈ ఆసనం ప్రతిరోజూ చేయడం వల్ల మీ శరీరం ఫిట్‌గా ఉంటుంది. శలభాసన ఈ ఆసనం వేయడానికి మీ పొట్టపై పడుకుని, మీ కాళ్ళు, ఛాతీ రెండింటినీ పైకి లేపండి. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల మీ




శరీరంలో ఫ్లెక్సిబిలిటీ వస్తుంది. వెన్నునొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ ఆసనం నడుము, వీపు, తొడల కండరాలను బలపరుస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. శరీరంలో వశ్యతను పెంచడంలో సహాయపడుతుంది. బాలసనం బాలసనాన్ని చైల్డ్ పోజ్ అని కూడా అంటారు. దీని కోసం ముందుగా నేలపై మోకాళ్లపై కూర్చుని.. ఆపై మీ మోకాళ్లను కొద్దిగా బయటికి విస్తరించండి. మీ శరీరాన్ని ముందుకు వంచి మీ నుదిటిని నేలపై ఉంచండి. మీ చేతులను మీ తొడల దగ్గర ఉంచి ముందుకు చాపండి. ఈ యోగాసనాన్ని చేయడం వల్ల ఒత్తిడి తగ్గి, వెన్నునొప్పి తగ్గుతుంది. తాడాసనం ఎత్తు పెరగని పిల్లలకు తాడాసనం చాలా మంచిదే అయినప్పటికీ.. మీ నడుములో నొప్పి ఎక్కువగా ఉంటే మీరు కూడా ఈ ఆసనం వేయవచ్చు. దీని కోసం నిటారుగా నిలబడి మీ రెండు చేతులను పైకి లేపండి. తుడుస్తున్నట్లు కల వస్తుందా.. దీని అర్థం ఏమిటో తెలిస్తే ఎగిరిగంతే ఆరోగ్యానికి మేలని తులసి ఆకులు నమిలేస్తున్నారా ఎంత ప్రమాదమో తెలుసా పంచ ముఖి ఆంజనేయస్వామిని ఇలా పూజించండి.. అపజయం మీ దరి చేరదు సృష్టిలో విచిత్రమైన సంఘటన పుట్టిన వెంటనే తల్లిని తినే జీవిఏమిటంటేశవాసన వెన్నునొప్పి నుంచి ఉపశమనం పొందడానికి ఇది సులభమైన మార్గం. దీని కోసం మీరు మీ వీపుపై నేరుగా పడుకుని.. మీ శరీరాన్ని పూర్తిగా వదులుగా ఉంచాలి. ఈ ఆసనం శరీరానికి, మనసుకు విశ్రాంతినిస్తుంది. ఇది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుంది

## ఎల్‌టీఐమైండ్‌ట్రీ నుంచి వైదొలిగిన దేశ్‌పాండే




ఎల్‌టీఐమైండ్‌ట్రీ నుంచి నచికేత్ దేశ్‌పాండే వైదొలిగారు. ఈ నెల 31 నుంచి హోల్-టైం డైరెక్టర్‌తోపాటు ప్రెసిడెంట్ పదవి నుంచి వైదొలుగుతున్నట్లు ఆయన ప్రకటించారు. ఎల్‌టీఐమైండ్‌ట్రీ నుంచి వైదొలిగిన దేశ్‌పాండేన్యూఢిల్లీ, అక్టోబర్ 21: ఎల్‌టీఐమైండ్‌ట్రీ నుంచి నచికేత్ దేశ్‌పాండే వైదొలిగారు. ఈ నెల 31 నుంచి హోల్-టైం డైరెక్టర్‌తోపాటు ప్రెసిడెంట్ పదవి నుంచి వైదొలుగుతున్నట్లు ఆయన ప్రకటించారు.ఈ సందర్భంగా ఎల్‌టీఐమైండ్‌ట్రీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రమణియన్ మాట్లాడుతూ..దేశ్‌పాండే సారథ్యంలో కంపెనీ అన్ని రంగాల్లో రాణించిందని, తదుపరి వృద్ధికి ఆయన పునాది వేశారన్నారు

## మూరత్ మురిపెం అంతంతే దేశీయ స్టాక్ మార్కెట్లో పటాకులు పేలలేవు




. దీపావళి సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహించిన మూరత్ ట్రేడింగ్‌లో సూచీలు అంతంత మాత్రంగానే లాభపడ్డాయి. దేశీయ స్టాక్ మార్కెట్లో పటాకులు పేలలేవు. దీపావళి సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహించిన మూరత్ ట్రేడింగ్‌లో సూచీలు అంతంత మాత్రంగానే లాభపడ్డాయి. నూతన సంవత్సరం సంవత్ 2082 తొలిరోజు మెరుపులు లేకుండా ముగిశాయి. కేవలం గంటపాటు సాగిన ట్రేడింగ్‌లో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 62.97 పాయింట్లు ఎగబాకి 84,426.34 వద్ద ముగియగా, నిఫ్టీ 25.45 పాయింట్లు అందుకొని 25,868.60 వద్ద ముగిసింది.మధ్యాహ్నం 1.45 గంటలకు ప్రారంభమైన ప్రత్యేక మూరత్ ట్రేడింగ్ సెషన్ 2.45 గంటలకు ముగిసింది. దీపావళి సందర్భంగా ట్రేడర్లు, ఇన్వెస్టర్లు ఈరోజు నూతన అకౌంటింగ్ బుక్స్‌ను తెరుస్తారు. ఈ మూరత్ ట్రేడింగ్‌లో బజాజ్ ఫిన్‌సర్వ్ అత్యధికంగా 1.42 శాతం లాభపడగా, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటర్స్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్ షేరు లాభాల్లో ముగిశాయి.కానీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, భారతీ ఎయిర్‌టెల్, మారుతి సుజుకీ, ట్రెంట్, టీసీఎస్ షేర్లు తగ్గుముఖం పట్టాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు ఒక్క శాతం వరకు లాభపడ్డాయి. రంగాలవారీగా ఇండస్ట్రియల్స్, టెలికాం, కమోడిటీస్, క్యాపిటల్ గూడ్స్, సర్వీసెస్, మెటల్ రంగ షేర్లు ఒక్క శాతం వరకు పెరుగగా..బ్యాంకింగ్, రియల్టీ రంగ షేర్లు నష్టపోయాయి. మరోవైపు, సంవత్ 2081లో సెన్సెక్స్ 4,974.31 పాయింట్లు లేదా 6.26 శాతం, నిఫ్టీ 1,637.80 పాయింట్లు లేదా 6.76 శాతం రిటర్న్లు పంచింది.

## కీలక రంగాలు నేలచూపులు



కీలక రంగాలు మళ్లీ నేలచూపులు చూశాయి. గత నెలకుగాను కేవలం 3 శాతం మాత్రమే వృద్ధిని కనబరించింది. ఆగస్టు నెలలో నమోదైన 6.5 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోగా, కానీ, క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 2.4 శాతంతో పోలిస్వే స్వల్పంగా పెరిగింది. 3 నెలల కనిష్ఠానికి పడిపోయిన వృద్ధిసెప్టెంబర్‌లో 3 శాతంగా నమోదుకీలక రంగాలు మళ్లీ నేలచూపులు చూశాయి. గత నెలకుగాను కేవలం 3 శాతం మాత్రమే వృద్ధిని కనబరించింది. ఆగస్టు నెలలో నమోదైన 6.5 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోగా, కానీ, క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 2.4 శాతంతో పోలిస్వే స్వల్పంగా పెరిగింది. దీంతో కీలక రంగాలు మూడు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయినట్టు అయిందని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది.బొగ్గు, క్రూడాయిల్, రిఫైనరీ, గ్యాస్ రంగాల్లో వృద్ధి ప్రతికూలానికి పడిపోవడం వల్లనే కీలక రంగాలు అమాంతం జారుకున్నాయని తెలిపింది. గత నెలలో బొగ్గు రంగంలో ఉత్పత్తి మైనస్ 1.2 శాతానికి పడిపోగా, క్రూడాయిల్ మైనస్ 1.3 శాతం, రిఫైనరీ ఉత్పత్తులు మైనస్ 3.7 శాతం, సహజ వాయువు మైనస్ 3.8 శాతం చొప్పున పడిపోయాయి. సహజ వాయువు ఉత్పత్తి గత ఏడాదిన్నరగా నేల చూపు చూస్తునేవున్నదని నివేదిక వెల్లడించింది. కానీ, స్టీల్‌కు డిమాండ్ అధికంగా ఉండటం కొంతలో కొంత ఊరటనిచ్చింది. ఎరువులు 1.6 శాతం, సిమెంట్ 5.3 శాతం, ఎలక్ట్రిసిటీ 2.1 శాతం చొప్పున ఆశాజనక పనితీరు కనబరిచాయి. అలాగే ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలానికిగాను ఎనిమిది కీలక రంగాల్లో వృద్ధి 2.9 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది 4.3 శాతంగా నమోదైంది. దేశీయ పారిశ్రామిక ప్రగతిలో కీలక రంగాల వాటా 40 శాతానికి పైగా ఉన్నది.

## స్టాక్ మార్కెట్‌లో స్పెషల్ మూరత్ ట్రేడింగ్.. లాభాల్లో ముగిసిన సూచీలు..!



భారత స్టాక్ మార్కెట్ ప్రత్యేకంగా మూరత్ ట్రేడింగ్ సెషన్‌ను నిర్వహించింది. దీపావళి పండుగ సందర్భంగా మంగళవారం మూరత్ ట్రేడింగ్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. కొత్త హిందూ క్యాలెండర్ సంవత్సరం, విక్రమ్ సంవత్ ప్రారంభాన్ని సూచిస్తుంది. భారత స్టాక్ మార్కెట్ ప్రత్యేకంగా మూరత్ ట్రేడింగ్ సెషన్‌ను నిర్వహించింది. దీపావళి పండుగ సందర్భంగా మంగళవారం మూరత్ ట్రేడింగ్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. కొత్త హిందూ క్యాలెండర్ సంవత్సరం, విక్రమ్ సంవత్ ప్రారంభాన్ని సూచిస్తుంది. హిందూ క్యాలెండర్ ప్రకారం కొత్త ఆర్థిక సంవత్సరం స్వాగతం పలుకుతూ ఈ మూరత్ ట్రేడింగ్ నిర్వహించే విషయం తెలిసిందే. బీఎస్ఈ, ఎన్ఎస్ఈ, ఎంసీఎక్స్, ఎన్‌సీడీఈఎక్స్ మూరత్ ట్రేడింగ్ మధ్యాహ్నం 1.15 గంటలకు ప్రారంభమై 1.45 గంటలకు 25,868.60 వద్ద ముగిసింది. దాదాపు 2,720 షేర్లు లాభపడ్డాయి. 902 షేర్లు క్షీణించాయి. నిఫ్టీలో సిప్లా, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, గ్రాసిమ్ లాభపడ్డాయి. అయితే కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మాక్స్ హెల్త్‌కేర్, ఆసియన్ పెయింట్స్ నష్టపోయాయి. మెటల్, మీడియా, టెలికాం ఒక్కొక్కటి 0.3శాతం పెరగ్గా.. బీఎస్ఈ మిడ్‌క్యా ఇండెక్స్ 0.2 శాతం పెరిగింది. స్మాల్ క్యాప్ ఇండెక్స్ దాదాపు ఒకశాతం వృద్ధిని నమోదు చేసింది.

## దద్దరిల్లిన దీపావళి అమ్మకాలు.. 6 లక్షల కోట్లకు పైగా సేల్స్!

దేశీయ మార్కెట్‌లో దీపావళి అమ్మకాలు దద్దరిల్లాయి. ఏకంగా రూ.6 లక్షల కోట్లను దాటిపోయాయి. మునుపెన్నడూ లేనివిధంగా రూ.6.05 లక్షల కోట్లుగా నమోదయ్యాయని అఖిల భారత వర్తకుల సమాఖ్య (సీఏఐటీ) మంగళవారం తెలియజేసింది. న్యూఢిల్లీ, అక్టోబర్ 21: దేశీయ మార్కెట్‌లో దీపావళి అమ్మకాలు దద్దరిల్లాయి. ఏకంగా రూ.6 లక్షల కోట్లను దాటిపోయాయి. మునుపెన్నడూ లేనివిధంగా రూ.6.05 లక్షల కోట్లుగా నమోదయ్యాయని అఖిల భారత వర్తకుల సమాఖ్య (సీఏఐటీ) మంగళవారం తెలియజేసింది. ఇందులో రూ.5.40 లక్షల కోట్లు వస్తు రూపంలో ఉంటే.. రూ.65,000 కోట్లు సేవల రూపేణా జరిగాయి. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధాని నగరాలు సహా 60 ద్వితీయ, తృతీయ శ్రేణి ప్రధాన నగరాలు, పట్టణాల్లో తమ రిసెర్చ్ విభాగం చేపట్టిన సర్వే ఆధారంగా ఈ లెక్కల్ని సీఏఐటీ వెల్లడించింది. గత ఏడాది దీపావళి విక్రయాలు రూ.4.25 లక్షల కోట్లుగా ఉన్నాయి.ఆఫ్‌లైన్ మార్కెట్ జోరుఈసారి రిటైల్, ముఖ్యంగా నాన్-కార్పొరేట్, సంప్రదాయ మార్కెట్ల లావాదేవీలు.. మొత్తం వాణిజ్యంలో 85 శాతంగా ఉన్నట్టు తాజా సర్వేలో తేలింది. దీంతో భౌతిక మార్కెట్ కార్యకలాపాలు, చిరు వ్యాపారుల అమ్మకాల్లో తిరిగి మునుపటి ఉత్సాహం కనిపించిందని సీఏఐటీ ఈ సందర్భంగా అభిప్రాయపడింది. కాగా, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపులు సైతం కలిసొచ్చాయన్న అంచనాలు సైతం ఉన్నాయి. ఆయా వస్తూత్పత్తుల ధరలు తగ్గడంతో వినియోగదారులు కొనుగోళ్లకు ముందుకొచ్చారని సీఏఐటీ అంటున్నది.ఈసారి దీపావళి అమ్మకాల్లో ప్యాకేజింగ్, ఆతిథ్య, క్యాబ్ సర్వీసెస్, ట్రావెల్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, టెంట్ అండ్ డెకరేషన్, మ్యాన్‌పవర్, డెలివరీ తదితర సేవా రంగాల వాటా రూ.65,000 కోట్లుగా ఉన్నది. చలికాలం, పెండ్లిళ్ల సీజన్, రాబోయే పండుగల దృష్ట్యా జనవరి మధ్యదాకా మార్కెట్‌లో ఈ జోష్ కనిపించే అవకాశాలున్నాయి.



## మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు.. ఇప్పుడే కొందామా.. ఇంకా ఆగుదామా..?



బంగారం, వెండి ధరలు తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతున్నాయి. దేశీయ స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) గోల్డ్ రేటు గత వారం మునుపెన్నడూ లేనివిధంగా 10 గ్రాములు రూ.1,34,800 పలికిన విషయం తెలిసిందే. అక్టోబర్ 21: బంగారం, వెండి ధరలు తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతున్నాయి. దేశీయ స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) గోల్డ్ రేటు గత వారం మునుపెన్నడూ లేనివిధంగా 10 గ్రాములు రూ.1,34,800 పలికిన విషయం తెలిసిందే. అలాగే కిలో వెండి విలువ కూడా ఆల్‌టైమ్ హైని తాకుతూ 1,85,000గా నమోదైన సంగతీ విదితమే. ఈ క్రమంలో ధరలు కొంతమేర తగ్గినా.. తిరిగి పుంజుకుంటున్నాయి. ముఖ్యంగా ఫ్యూచర్స్ మార్కెట్లలో విజృంభిస్తున్న సంకేతాలనే ఇస్తున్నాయి.ఇదీ సంగతి..మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్ (ఎంసీఎక్స్)పైడిసెంబర్ డెలివరీకిగాను సోమవారం గోల్డ్ ఫ్యూచర్స్ రూ.3,580లేదా2.82 శాతం పెరిగి తులం రూ.1,30,588 పలికింది. ఐదు రోజుల ర్యాలీకి బ్రేక్ వేస్తూ శుక్రవారంరూ.1,27,008కి దిగజారినదితెలిసిందే.అయితేఅంతకు ముందు రూ.1,32,294 స్థాయిని తాకి ఆల్‌టైమ్ హై రికార్డు నమోదైంది. మళ్లీఒక్కరోజు వ్యవధిలో రూ.3,580 పెరిగి మార్కెట్‌లో గోల్డ్ రష్‌కు అద్దం పట్టింది.ఇకడిసెంబర్‌కుగాను సిల్వర్ ఫ్యూచర్స్ రూ.1,571 లేదా 1 శాతం పుంజుకొని కిలో రూ.1,58,175గా నమోదైంది. రికార్డు హై నుంచి ఇది దాదాపు 6 శాతం తక్కువ. అయినప్పటికీ పరిశ్రమల నుంచి డిమాండ్, సరఫరాలో అడ్డంకుల వల్ల ధరలు తిరిగి పరుగులు పెడుతున్నాయి. నిజానికి స్పాట్ మార్కెట్ కంటే ఫ్యూచర్స్ మార్కెట్‌లో గోల్డ్, సిల్వర్ ధరలు తక్కువగా ఉంటాయి. అయితే ఫ్యూచర్స్ మార్కెట్ ఆధారంగా స్పాట్ మార్కెట్‌లో ఒకింతఅంచనావేయవచ్చనిమార్కెట్‌నిపుణులువిశ్లేషిస్తున్నారు.తగ్గుతుందని ఆగవచ్చా?అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులతో స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. రాబోయే ద్రవ్యసమీక్షల్లో అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించబోతున్నదన్న సంకేతాలు.. బాండ్ మార్కెట్లను షేక్ చేస్తున్నాయి. దీంతో మదుపరులకు తమ పెట్టుబడుల రక్షణార్థం కనిపిస్తున్న ఏకైక మార్గం బంగారమే అవుతున్నదని ఆర్థిక, మార్కెట్ నిపుణులు ప్రస్తుత సరళిని విశ్లేషిస్తున్నారు. అందుకే బంగారం ధరలు రికార్డు స్థాయిలో పలుకుతున్నాయని పేర్కొంటున్నారు. ప్రపంచ స్థాయిలో డిసెంబర్ డెలివరీకిగాను ప్రధాన ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ మార్కెట్ కామెక్స్‌లోనూ గోల్డ్ 62.46 డాలర్లు లేదా 1.48 శాతం ఎగబాకి ఔన్స్ 4,275.76 డాలర్లు పలికింది. సిల్వర్ 1.5 శాతం ఎగసి ఔన్స్ 50.85 డాలర్లు పుంజుకున్నది. ఈ నేపథ్యంలో సాధారణ కొనుగోలుదారులు.. పెండ్లిళ్లు, ఇతర శుభకార్యాల కోసమైతే అవసరాన్నిబట్టి బంగారాన్ని కొనుగోలు చేసుకోవచ్చని మార్కెట్ ఎక్స్‌పర్ట్స్ సలహా. ఇక మదుపరులు.. ఇప్పుడున్న అధిక ధరల్లో పెద్ద ఎత్తున గోల్డ్‌పై ఇన్వెస్ట్ చేయడం అంత తెలివైన నిర్ణయం కాదని అంటున్నారు. కొద్ది మొత్తాల్లో పెట్టుబడులకు దిగడమే ఉత్తమం అని చెప్తున్నారు.వెండికి ఎందుకింత డిమాండ్?ఏడాది క్రితం కిలో రూ.90,000 పలికిన వెండి ధర.. ఇప్పుడు రెట్టింపైంది. ఒకానొక దశలో రూ.2 లక్షలను తాకుతుందన్న అంచనాలూ వినిపించాయి. ఇటీవలికాలంలోనైతే రోజూ రూ.5వేల నుంచి రూ.8వేలు పెరిగిన సందర్భాలుండటం.. మార్కెట్‌లో వెండి గిరాకీకి అద్దం పడుతున్నది. దీనికి పరిశ్రమల నుంచి ఉన్న డిమాండే ప్రధాన కారణమని వ్యాపార వర్గాలు చెప్తున్నాయి. ఎలక్ట్రికల్స్-ఎలక్ట్రానిక్స్, ఆటో-ఎలక్ట్రిక్ వెహికిల్స్, సోలార్ ఎనర్జీ, సెమీకండక్టర్, మెడిసిన్, బ్రేజింగ్ అల్లాయిస్-సోల్డర్స్ తదితర పరిశ్రమల నుంచి వెండికి డిమాండ్ విపరీతంగా పెరిగిపోయింది. ఇక బంగారం ధర కొండెక్కడంతో చాలామంది సిల్వర్ జ్యుయెల్లరీపట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. వెండి నగల తయారీ బాగా పెరిగింది. అలాగే ఇన్వెస్టర్లు, ముఖ్యంగా బ్యాంకులు పసిడి నిల్వలతోపాటు వెండి నిల్వలనూ పెంచుకుంటున్నాయి. ఈ కారణాల చేతనే వెండి ఆదరణ ఎక్కువైందని బులియన్, నగల వర్తకులు పేర్కొంటున్నారు.

## టాటా మోటార్స్ దూకుడు.. నెల రోజుల్లో లక్షకుపైగా డెలివరీలతో సరికొత్త రికార్డు..!

భారత్‌కు చెందిన ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ టాటా మోటార్స్ సరికొత్త రికార్డును సృష్టించింది. దాదాపు నెల రోజుల్లోనే లక్షకుపైగా కార్లను డెలివరీ చేసింది. నవరాత్రుల నుంచి దీపావళి మధ్యకాలంలో కంపెనీ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసినట్లు వెల్లడించింది. భారత్‌కు చెందిన ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ టాటా మోటార్స్ సరికొత్త రికార్డును సృష్టించింది. దాదాపు నెల రోజుల్లోనే లక్షకుపైగా కార్లను డెలివరీ చేసింది. నవరాత్రుల నుంచి దీపావళి మధ్యకాలంలో కంపెనీ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసినట్లు వెల్లడించింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సారి అమ్మకాలు 33శాతం వరకు పెరిగాయని టాటా మోటార్స్ చెప్పింది. జీఎస్టీ తగ్గింపుతో పాటు పండుగ సమయంలో డిమాండ్ కారణంగా అమ్మకాలు భారీగా పెరిగాయి. కంపెనీ యూఎస్‌వీ మోడల్స్‌కు ఫుల్ డిమాండ్ కనిపించింది. ఈ సందర్భంగా టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ఎండీ, సీఈవో శైలేష్ చంద్ర మాట్లాడారు. నవరాత్రుల నుంచి దీపావళి మధ్య నెల రోజుల్లో లక్షకుపైగా వాహనాల డెలివరీలతో చారిత్రక మైల్‌స్టోన్ చేరామన్నారు.ఎస్‌యూవీలు ఈ వృద్ధిని ముందుకు నడిపించాయన్నారు. కంపెనీ విక్రయించిన వాహనాల్లో అత్యధికంగా నెక్సాన్ మోడల్‌ను డివిలరీ చేసింది. 38వేల యూనిట్లతో 73శాతం వృద్ధిని నమోదు చేసింది. అలాగే, టాటా పంచ్ 32వేల యూనిట్లతో 29శాతం వృద్ధిని సాధించినట్లు చెప్పింది. ఎస్‌యూవీలతోపాటుఈవీ విభాగంలోనూ భారీగానే డెలివరీలు చేసింది. నెలరోజులపండుగసీజన్ సమయంలో దాదాపు 10వేలకుపైగా ఈవీ కార్లను డెలివరీచేసినట్లుచెప్పింది. గతేడాదితో పోలిస్తే అమ్మకాలు 37శాతం పెరిగాయని..ఈ విజయంతో మిగతా కాలంలోనూ మంచి ఉత్సాహాన్ని ఇస్తుందనిభావిస్తున్నామని.. రాబోయే రోజుల్లో కొత్త మోడల్స్‌ను విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లుగా సీఈవో తెలిపారు. ఆటోమొబైల్ ఇండస్ట్రీ అంచనా ప్రకారం.. ఈ సీజన్లో భారీగా అమ్మకాలు జరిగాయి. ధనత్రయోదశి రోజున అన్ని కంపెనీలు కలిసి ఒకేరోజు లక్షకుపైగా వాహనాలను డెలివరీ చేశాయి. మార్కెట్‌లో వీటి విలువ రూ.8500 కోట్ల నుంచి రూ.10వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా.




## దేశ చరిత్రలోనే తొలిసారిగా..! దీపావళి రోజున రూ.6.05లక్షల కోట్ల అమ్మకాలు..!

ఈ ఏడాది దేశవ్యాప్తంగా దీపావళి అమ్మకాలు రూ.6.05లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇందులో రూ.5.40 కోట్ల విలువైన వస్తువ వ్యాపారం.. రూ.65వేల కోట్ల విలువైన సర్వీసెస్ వ్యాపారం జరిగిందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్ నివేదికను విడుదల చేసింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా దీపావళి అమ్మకాలు రూ.6.05లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇందులో రూ.5.40 కోట్ల విలువైన వస్తువ వ్యాపారం.. రూ.65వేల కోట్ల విలువైన సర్వీసెస్ వ్యాపారం జరిగిందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (%జూ×ు%) నివేదికను విడుదల చేసింది. ఇదే ఇప్పటి వరకు దేశ వాణిజ్య చరిత్రలో అతిపెద్ద పండుగగా నిలిచింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానులతో పాటు టైర్-2, టైర్-3 నగరాలతో సహా దేశవ్యాప్తంగా 60 ప్రధాన కేంద్రాల్లో సీఏఐటీ రీసెర్చ్ అండ్ ట్రేడ్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వహించిన సర్వే ఆధారంగా 'డిటైర్డ్ దీపావళి పండుగ అమ్మకాలు 2025' పేరుతో నివేదికను విడుదల చేసింది. సీఏఐటీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ మాట్లాడుతూ.. కేంద్రం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలు, స్వదేశీ స్వీకరణకు బలమైన బ్రాండ్ అంబాసిడర్‌గా ఎదిగారని నివేదిక చూపిస్తుందని పేర్కొంది.ఇది వ్యాపారులు, వినియోగదారులు ఇద్దరిని అపూర్వమైన రీతిలో ప్రేరేపించిందని అన్నారు. 87శాతం మంది వినియోగదారులు విదేశీ వస్తువుల కంటే భారతీయ వస్తువులను కొనుగోలు చేసేందుకు ఇష్టపడ్డారని.. తత్ఫలితంగా చైనా ఉత్పత్తులకు



డిమాండ్ భారీగా తగ్గిందని పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే భారత్‌లో తయారైన అమ్మకాలు 25శాతం పెరిగాయని వ్యాపారులు పేర్కొన్నారు. దీపావళి సందర్భంగా అమ్మకాల్లో కిరాణా, ఎఫ్ఎంసీజీ 12శాతం, బంగారం-వెండి 10శాతం, ఎలక్ట్రానిక్స్ 8శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్ 7శాతం, రెడీమేడ్ దుస్తులు 7శాతం, గిఫ్ట్ ఐటమ్స్ 7శాతం, హోమ్ డేకర్ 5శాతం, ఫర్నిషింగ్-ఫర్నీచర్ 5శాతం, స్వీట్లు-స్నాక్స్ 5శాతం, వస్త్రాలు 4శాతం, పూజ వస్తువులు 3శాతం, పండ్లు- గింజలు 3శాతం, బేకరీ-మిఠాయిలు 3శాతం, పాదరక్షలు 2శాతం, ఇతర వస్తువులు 19శాతం అమ్మకాలు జరిగాయని క్యాట్ జాతీయ అధ్యక్షుడు బీసీ భారతీయ పేర్కొన్నారు. సేవల రంగం సైతం గణనీయమైన వృద్ధిని సాధించిందని.. రూ.65వేల కోట్ల వాణిజ్యాన్ని సృష్టించిందన్నారు.ప్యాకేజింగ్, హాస్పిటాలిటీ, టాక్సీ సేవలు, జర్నీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్, టెంట్లు-అలంకరణలు, మానవశక్తి-డెలివరీ వంటి రంగాలలో కూడా అపూర్వమైన కార్యకలాపాలు జరిగాయని.. పండుగ ఆర్థిక వ్యవస్థ పరిధిని విస్తరించిందని పేర్కొన్నారు. సర్వేలో పాల్గొన్న వ్యాపారుల్లో 72శాతం మంది తమ అమ్మకాలు పెరగడానికి జీఎస్టీ రేట్ల తగ్గింపే కారణమని చెప్పారు. ధరలు స్థిరంగా ఉండడంపై వినియోగదారులు రూ.6.05లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇందులో రూ.5.40 కోట్ల విలువైన వస్తువ వ్యాపారం.. రూ.65వేల కోట్ల విలువైన సర్వీసెస్ వ్యాపారం జరిగిందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (%జూ×ు%) నివేదికను విడుదల చేసింది. ఇదే ఇప్పటి వరకు దేశ సంతృప్తిని వ్యక్తం చేసినట్లుగా తెలిపారు. వ్యాపారులు, వినియోగదారుల వినియోగదారుల సెంటిమెంట్ దశాబ్దంలోనే ఈ సారి అత్యధికంగా ఉందని నివేదిక తెలిపింది. ట్రేడర్ కాన్ఫిడెన్స్ ఇండెక్స్ (%ుజ×%) 8.6/10, కన్స్యూమర్ కాన్ఫిడెన్స్ ఇండెక్స్ (%జజ×%) 8.4/10గా ఉన్నది. ఈ ఉత్సాహభరితమైన సెంటిమెంట్ శీతాకాలం, వివాహాల సీజన్, జనవరి మధ్యలో ప్రారంభమయ్యే రాబోయే పండుగ సీజన్ అంతటా కొనసాగుతుందని నివేదిక పేర్కొంది. దీపావళి-2025 బిజినెస్ ఐదు మిలియన్ల తాత్కాలిక ఉద్యోగాలను సృష్టించిందని నివేదిక తెలిపింది.



## దీపావళి వేళ క్యూట్ ఫోటోలు వైరల్

టాలీవుడ్ ఇండస్ట్రీలో హీరోయిన్ సమంత గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. అక్కినేని నాగచైతన్యకు విడాకులు ఇచ్చిన తర్వాత సమంత బ్రాండ్ మరింత పెరిగింది.మొదట్లో అనారోగ్యంతో బాధపడిన సమంత, ఆ తర్వాత ఆ క్రమక్రమంగా కోలుకుంది. అదే సమయంలో తన కెరీర్ పై ప్రత్యేక దృష్టి పెట్టి సక్సెస్ అవుతోంది సమంత. హీరోయిన్ గానే కాకుండా నిర్మాతగా కూడా ప్రస్తుతం హీరోయిన్ సమంత దూసుకు వెళ్తున్నారు. అటు వ్యాపారాలు కూడా లాభాల్లో దూసుకు వెళ్తున్నాయి. చేతినిండా సంపాదిస్తున్న సమంత తాజాగా దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఇటీవల హీరోయిన్ సమంత కొత్త ఇంటిని కొనుగోలు చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో తన కొత్త ఇంట్లోనే తాజాగా దీపావళి చేసుకున్నారట సమంత. అయితే ఈ వేడుకల్లో రాజ్ నిడిమోరు కూడా పాల్గొన్నారు. దీంతో సమంత దీపావళి వేడుకల ఫోటోలు సోషల్ మీడియాను దున్నేస్తున్నాయి. రాజ్ నిడిమోరుతో హీరోయిన్ సమంత రిలేషన్ పెట్టుకుందని గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. అతన్నే హీరోయిన్ సమంత త్వరలో రెండో పెళ్లి చేసుకోబోతున్నట్లు కూడా వార్తలు వైరల్ చేశారు. అయితే దీనిపై ఇప్పటి వరకు ఈ ఇద్దరు ఎక్కడా కూడా స్పందించలేదు. కానీ సమంత ఎక్కడ ఉంటే అక్కడే రాజ్ నిడిమోరు కనిపిస్తున్న నేపథ్యంలో రూమర్స్ వైరల్ అవుతున్నాయి. ఇక లేటెస్ట్ గా దీపావళి వేడుకలు కూడా సమంతతో రాజ్ నిడిమోరు చేసుకున్నాడు.

## తరుణ భాస్కర్‌తో ఈషా రెబ్బ దీపావళి వేడుకలు



తెలుగు అమ్మాయి ఈషా రెబ్బ గురించి తెలియని వారు ఉండరు. 2012 సంవత్సరంలో లైఫ్ ఈజ్ బ్యూటీ ఫుల్ సినిమాతో మెరిసిన ఈ అందాల తార పలు సినిమాల్లో హీరోయిన్ గా కూడా ఛాన్స్ కొట్టేసింది.పెద్ద హీరోయిన్ గా పేరు సక్సెస్ కాలేకపోతున్న ఈశా రెబ్బ, చిన్న పాత్రలు వచ్చినా చేస్తోంది. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్, అరవింద సమేత వీర రాఘవ లాంటి సినిమాలలో సైడ్ హీరోయిన్ పాత్రలు చేసి మెప్పించింది. అయితే అలాంటి ఈషా రెబ్బ ఈ మధ్యకాలంలో పిట్టకథలు, 3రోజెస్ లాంటి వెబ్ సిరీస్ లో కూడా నటించింది. ఇది ఇలా ఉండగా తాజాగా ఈషా రెబ్బ గురించి ఓ సంచలన విషయం బయటకు వచ్చింది. దీపావళి సందర్భంగా దర్శకుడు తరుణ్ భాస్కర్ తో ఈషా రెబ్బ మెరిశారు. దీపావళి టపాకాయలు పేల్చుతూ సందడి చేశారు. విశ్వక్ సేన్ ఇంట్లో ఈ దీపావళి వేడుకలు జరిగినట్లు తెలుస్తోంది. దీంతో విశ్వక్ సేన్ ఇంటికి తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బ కలిసి వెళ్లారు. దీంతో వీళ్లిద్దరూ క్లోజ్ గా కనిపించిన ఫోటోలు వైరల్ గా మారాయి. ఈ నేపథ్యంలోనే తరుణ్, ఈషా రెబ్బ మధ్య రిలేషన్ ఉందని సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరుగుతోంది. అయితే ఇందులో ఏమాత్రం వాస్తవం లేదని మరికొందరు అంటున్నారు. తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో ఈషా రెబ్బ త్వరలో కొత్త సినిమా చేయబోతున్నారని, అందుకే అతనితో వెళ్ళినట్లు చెబుతున్నారు.

## బ్రేకప్‌పై రష్మిక రియాక్షన్!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందాన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కన్నడ నుంచి తెలుగులో అడుగుపెట్టిన ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్ గా



ఎదిగారు.ముఖ్యంగా పుష్ప, యానిమల్ సినిమాలు చేసిన తర్వాత రష్మిక స్టార్ డం మొత్తం మారిపోయింది. ఇప్పుడు బాలీవుడ్ లోనే వరుసగా సినిమాలు చేస్తోంది ఈ అందాల తార రష్మిక. ప్రస్తుతం ది గర్ల్ ఫ్రెండ్ సినిమా ( %ఒష్ట్రవ +అతీశ్రీటతీఅవఅ%) ప్రమోషన్స్ లో హీరోయిన్ రష్మిక కూడా పాల్గొంటున్నారు. ఈ సినిమా నవంబర్ 7వ తేదీన రిలీజ్ కానుంది. రాహుల్ రవీంద్రన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. రష్మికకు జోడిగా దీక్షిత్ శెట్టి మెరుస్తున్నారు. అయితే ఈ సినిమా గురించి పలు విషయాలు పంచుకున్న రష్మిక.. రిలేషన్ షిప్ బ్రేకప్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ప్రేమలో బ్రేకప్ అయితే, అబ్బాయిల కంటే ఎక్కువగా అమ్మాయిలు బాధపడతారని ఆమె పేర్కొన్నారు. ఇది తన పర్సనల్ అభిప్రాయం అంటూ ఎమోషనల్ అయ్యారు. బ్రేకప్ విషయంలో అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిలు బాధపడతారని ప్రచారం చేస్తున్నారు.. కానీ అందులో చాలా తప్పు ఉందని ఆమె పేర్కొన్నారు. ఆ విషయాన్ని ఖండిస్తున్నట్లు వెల్లడించారు. బాధను వ్యక్తపరిచేందుకు తాము గడ్డం పెంచలేము అని, మందు తాగలేమని ఆమె సెటైర్లు కూడా పేల్చారు. లోలోపల అమ్మాయిలకే బాధ ఎక్కువగా ఉంటుందన్నారు. కానీ ఆ బాధ బయటకు చూపించబోరని తెలిపారు. లవ్ ఫెల్యూర్ అయితే, గుండె పగిలిపోతుందంటూ పేర్కొన్నారు. దీంతో రష్మిక చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. కాగా విజయ్ దేవరకొండ, రష్మిక ఇద్దరు ఎంగేజ్మెంట్ చేసుకున్నట్లు మొన్న దసరా నుంచి వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే.

## థ్రిల్ చేసే 'ది బ్లాక్ గోల్డ్'



కథానాయిక సంయుక్త తొలిసారి ఓ ఫిమేల్ సెంట్రిక్ ఫిల్మ్‌లో నటిస్తున్నారు. యోగేష్ కెఎంసి దర్శకత్వం వహిస్తున్నారు. ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని 'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' వంటి విజయ వంతమైన చిత్రాలు అందించిన నిర్మాత రాజేష్ దండా నిర్మిస్తున్నారు. హాస్య మూవీస్, మాగంటి పిక్చర్స్‌తో కలిసి చేస్తున్న ఆరవ సినిమా ఇది. సంయుక్త స్వయంగా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. సింధు మాగంటి సహ నిర్మాత. ఆదివారం మేకర్స్ ఈ సినిమా టైటిల్‌ని అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి 'ది బ్లాక్ గోల్డ్' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ ఫిక్స్ చేశారు. టైటిల్ పోస్టర్ అదిరిపోయింది. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్ నేడు (సోమవారం) విడుదల కానుంది. దర్శకుడు యోగేష్ కెఎంసి థ్రిల్లర్ జానర్‌కి కొత్త కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ ప్రేక్షకులకు థ్రిల్ చేయబోతున్నారు. సంయుక్త డైనమిక్ పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రంలో ఆమె అద్భుతమైన స్టంట్స్ చేస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రానికి డీవోపీ: ఎ.వసంత్, సంగీతం: సామ్ సిఎస్, ఎడిటర్: ఛోటా కె ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: సాహి సురేష్, కథ- డైలాగ్స్: యోగేష్, ప్రసాద్ నాయుడు, స్క్రిప్ట్ కో-ఆర్డినేటర్: మధు విప్పర్తి, యాక్షన్: రామకృష్ణ, సాహిత్యం: రామజోగయ్య శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ పోపూరి.

## జాక్ టైంలో ఇది జరిగింది!



చిన్న చిన్న పాత్రలతో మొదలుపెట్టి.. ఆ తర్వాత హీరోగా మారి.. స్టార్ ఇమేజ్ సంపాదంచిన నటుడు సిద్ధు కరోనా టైంలో ఓటీటీలో రిలీజైన కృష్ణ అండ్ హిజ్ లీల అతడికి ఫస్ట్ బ్రేక్ ఇవ్వగా.. డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ చిత్రాలు బ్లాక్‌బస్టర్లయి తన రేంజ్ పెంచాయి. కానీ టిల్లు స్క్వేర్ తర్వాత వచ్చిన జాక్ మాత్రం పెద్ద డిజాస్టర్ అయి సిద్ధును తీవ్ర నిరాశకు గురి చేసింది. ఆ సినిమా మిగిల్చిన నష్టాల గురించి ఇండస్ట్రీలో పెద్ద చర్చే జరిగింది. టిల్లు స్క్వేర్ వసూళ్లలో పదో వంతు కూడా ఈ సినిమాకు రాకపోవడం.. భారీ బడ్జెట్ సినిమాలను మించి దీనికి నష్టాలు రావడం గురించి చాలా రోజులు ఇండస్ట్రీలో మాట్లాడుకున్నారు. సిద్ధును పరోక్షంగా టార్గెట్ చేస్తూ ఒక నిర్మాత ప్రెస్ మీట్లో చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. దీని గురించి తాజాగా కొందరు జర్నలిస్టులతో కలిసి పాల్గొన్న ఒక ఇంటర్వ్యూలో సిద్ధు స్పందించాడు. జాక్ సినిమా విషయంలో తనను కావాలనే టార్గెట్ చేశారని సిద్ధు అభిప్రాయపడ్డాడు. పనిగట్టుకుని తనను సెంటర్ చేసి నిందించే ప్రయత్నం జరిగిందని అతనన్నాడు. ఆ సమయంలో తాను బాధ పడ్డట్లు అతను చెప్పాడు. జాక్ సినిమా ఫెయిలయ్యాక తనను నిర్మాతలేమీ డబ్బులు అడగలేదని.. కానీ తనే ముందుకొచ్చి పారితోషకంలో కొంత భాగాన్ని (దాదాపు నాలుగన్నర కోట్లని వార్తలు వచ్చాయి) వెనక్కిచ్చినట్లు అతను వెల్లడించాడు. తాను ప్రశాంతంగా పడుకోవాలంటే ఆ డబ్బులు వెనక్కి ఇవ్వాలి అనిపించి ఇచ్చినట్లు అతను చెప్పాడు. ఎవరైనా స్టేజ్ మీద, ఇంటర్వ్యూల్లో కాన్ఫిడెంట్‌గా మాట్లాడితే జనం తట్టుకోలేరని.. ఇలా చేస్తే యారొగెన్స్ అంటారని.. ఎప్పుడూ చేతులు కట్టుకుని, వినమ్రంగా ఉండాలని కోరుకుంటారని అతనన్నాడు. తాను స్క్రిప్టు రాయగలనని చెప్పినా అది కూడా యారొగెన్స్ లాగా చూస్తారని సిద్ధు ఆశ్చర్యపోయాడు. తాను రాసిన స్క్రిప్టు సక్సెస్ అవుతుందా లేదా అన్నది వేరే విషయమని.. కానీ ఒక సీన్ రాయడం, దాన్ని తెరపై ప్రెజెంట్ చేయడం తనకు తెలుసని అతనన్నాడు. కానీ ఇలాంటివి చెబితే చాలామంది తట్టుకోలేరని సిద్ధు వ్యాఖ్యానించాడు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332